

మరిన్ని కథనాల కోసం యూట్యూబ్‌లో ప్రసారమవుతున్న మీ SREECHAKRA NewsTVని వీక్షించవచ్చు. ప్లీజ్, సబ్‌స్క్రైబ్, లైక్,



https://www.sreechakranews.com

# శ్రీచక్ర

SREECHAKRA TELUGU DAILY

సంపుటి 10 | సంచిక 123 | కర్నూలు | శుక్రవారం 30 మే 2025

పేజీలు : 08 | వెల రూ. 5.00

Published from Kurnool... Circulated by Andhra Pradesh, Telangana & New delhi



**విలేకరులు కావలెను**

శ్రీచక్ర




ఆంధ్రప్రదేశ్-తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని జిల్లాలు, తాలుకా, మండలాల్లో శ్రీచక్ర తెలుగు దినపత్రికలో SREECHAKRA NewsTV ల్లో వార్తల సేకరణకు విలేకరులు కావలెను. జర్నలిస్టుగా రాణించాలనుకునేవారికి అవకాశం.. ఆసక్తి గల వారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.


మీ..

డాక్టర్ హరినాథరెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్

9848334101
8333000509


## మహానాడు

# గ్రాండ్ సక్సెస్




కడప, మే 29: కడప మహానాడు గ్రాండ్ సక్సెస్ అయ్యిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. కడప టీడీపీ మహానాడు బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు. ఈ సందర్భంగా జై తెలుగుదేశం అని కార్యకర్తలతో చెప్పించారు ముఖ్యమంత్రి. రాయలసీమ గర్జన రాష్ట్రం అంతా మారుమ్రోగాలన్నారు. జనసంద్రంగా కడప నిండిపోయిందన్నారు. ఎన్నోసార్లు కడపకు వచ్చానని.. ఇంత పెద్ద సంఖ్యలో ప్రజలు టీడీపీ మహానాడుకు రావడం చూసి కొండంత ధైర్యం వచ్చిందన్నారు. కడపలో మహానాడు పెడితే చాలామంది అనుమానించారని సీఎం తెలిపారు.

**పదికి పది గెలుస్తాం :** కానీ కడప టీడీపీ అడ్డా అని నిరూపించేందుకే మహానాడు ఇక్కడ పెట్టామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మొదటి మహానాడు దేవునిగడపలో జరిగిందని.. రెస్పాన్స్ అదిరిందన్నారు. మహానాడు సూపర్ హిట్ అయ్యిందని అన్నారు. కడప రాజకీయం మారబోతోందని.. కడప గడపలో మార్పు కనిపిస్తుందని గత ఎన్నికల ప్రచారంలో చెప్పానన్నారు. అహంకారంతో విర్రవీగే వారికి ఎన్నికల్లో కడప జిల్లా ప్రజలు అద్భుతమైన తీర్పునిచ్చారని కొనియాడారు. ఈ ఎన్నికల్లో కడపతో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో అద్భుతమైన విజయం సాధించామన్నారు. ఉమ్మడి కడపలో పదికి ఏడు స్థానాలు గెలిచామని చెప్పుకొచ్చారు. ఇప్పటి నుంచి కష్టపడితే 2029 ఎన్నికల్లో పదికి పదికి స్థానాలు గెలుచుకుంటామని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో రాయలసీమ ప్రజలు అద్భుతమైన తీర్పు ఇచ్చారని, 52 సీట్లకు 45 సీట్లతో కూటమిని గెలిపించారన్నారు. వైసీపీకి రాయలసీమలో ఏడు సీట్లు వస్తే టీడీపీ కూటమికి ఒక్క ఉమ్మడి కడప జిల్లాలోనే ఏడు సీట్లతో గెలిపించారన్నారు. ఈ తీర్పును మనం అర్థం చేసుకున్నామని.. కానీ ఓడిపోయిన పార్టీ ఇంకా అర్థం చేసుకోలేదని మండిపడ్డారు. టీడీపీ అధికారం కోసం పుట్టిన పార్టీ కాదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అవమానాలు, అక్రమ కేసులు, నిర్బంధాలు అన్నింటినీ ఎదుర్కొన్నారని.. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందంటే అది కార్యకర్తలు, నేతలు త్యాగాలే అని తెలిపారు. మెజార్టీలు అత్యధికంగా వచ్చాయన్నారు. ఏడాది క్రితం రాష్ట్రం విధ్వంస పాలనతో 30 ఏళ్లు వెనక్కు వెళ్లిందని విమర్శించారు. 'కష్టాలు, సవాళ్లను చూసి నేను భయపడలేదు. నేను క్లైమోర్ మైన్‌లకు భయపడలేదు. వీటికి భయపడతానా' అని ప్రశ్నించారు చంద్రబాబు. సైకిళ్లు వేసుకుని కడప మహానాడుకు వచ్చారంటూ.. కోడూరు నుంచి సైకిల్ వేసుకుని వచ్చిన వ్యక్తిని సభా వేదికపై సీఎం చూపించారు. ఇటువంటి కార్యకర్తలు ఏ పార్టీకైనా ఉంటారా అని ప్రశ్నించారు. ఇటువంటి కార్యకర్తలు ఉండటం పార్టీకి అదృష్టం అని అన్నారు. అన్న క్యాంటీన్లు తెరవడం, రోడ్లు బాగుచేయడం, పెన్షన్లు 4 వేలు చేయడం, దేవాలయాల్లో అన్నదానం ప్రారంభం విషయాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గుర్తుచేశారు. కేంద్ర పథకాలు నిధులు డైవర్ట్ చేశారని మండిపడ్డారు. తాను వెంటనే పథకాలను పునరుద్ధరించానని తెలిపారు. తెలుగుదేశం అంటేనే బీసీల పార్టీ అని.. బీసీల కోసం బడ్జెట్‌లో రూ.47 వేల కోట్లు పెట్టామని చెప్పారు. పలు బీసీ వర్గాలకు ఇచ్చిన పథకాలను సీఎం గుర్తుచేశారు. సూర్యఘర్ పథకం కింద ఎస్సీ, ఎస్టీలకు ఫ్రీ గా సోలార్ విద్యుత్ ఇస్తామన్నారు. రైతులకు వ్యవసాయ పంపు సెట్లు వద్ద సోలార్ విద్యుత్ పెట్టుకోవాలని సీఎం చెప్పారు. ఉద్యోగులను గత ప్రభుత్వం అవమానాలకు గురి చేసిందని.. కానీ ఇప్పుడు ఒకటవ తేదీన జీతాలు ఇస్తున్నామని తెలిపారు.


# ఆపరేషన్ సిందూర్‌తో దీటైన జవాబిచ్చాం..

## సిక్కిం రాష్ట్ర అవతరణ వేడుకల్లో ప్రధాని మోదీ



న్యూఢిల్లీ: 50వ రాష్ట్ర అవతరణ దినోత్సవం జరుపుకుంటున్న సిక్కిం ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. వర్చువల్‌గా వారిని ఉద్దేశించి ప్రసంగించారు. సిక్కిం అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వానికి అన్ని రకాలుగా సాయం చేస్తానని ప్రధాని అన్నారు. ఈ సందర్భంగా ఆపరేషన్ సిందూర్ గురించి ప్రధాని మోదీ ప్రస్తావించారు.'పర్యాటక రంగ ప్రభావం ఎంత గొప్పదో సిక్కిం ప్రజలకు తెలుసు. పర్యాటకం అంటే విభిన్నత్వానికి ప్రతీక. ఇక, పహల్గాం ఘటన భారత్‌పై జరిగిన ఉగ్రదాడి మాత్రమే కాదు. మానవత్వం, సోదరభావంపై జరిగిన దాడి"ఎన్నో భారతీయ కుటుంబాల సంతోషాన్ని టెర్రరిస్టులు హరించారు. భారత్‌లో చీలిక తెచ్చే ప్రయత్నం చేశారు. అయితే, భారత ఐకమత్యం ఎంత గొప్పదో ప్రపంచం చూసింది. ఆపరేషన్ సిందూర్ ద్వారా దేశమంతా ఒక్కటై ఉగ్రవాదులకు దీటుగా బదులిచ్చింది. ఉగ్రవాద శిబిరాలు ధ్వంసమవడంతో పాక్ ఆక్రోశంతో మన సైన్యం, పౌరులపై దాడులకు తెగబడింది. దీంతో పాక్ బండారం బయటపడింది. పాక్ వైమానిక స్థావరాలను అత్యంత కచ్చితత్వంతో ధ్వంసం చేయడం ద్వారా భారత స్పందన ఎంత తీవ్రంగా ఉంటుందో వాళ్లకు చూపించాము' అని ప్రధాని మోదీ అన్నారు. ఈ సందర్భంగా ప్రధాని.. రాష్ట్రంలో పలు అభివృద్ధికారక ప్రాజెక్టులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. నమ్చి జిల్లాలో రూ.750 కోట్లతో నిర్మించనున్న 500 పడకల జిల్లా ఆసుపత్రి, సాంగాచోలింగ్‌లోని ప్యాసెంజర్ రోప్‌వే, గాంగ్‌టాక్ జిల్లాలోని అటల్ అమృత్ ఉద్యానవనంలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈశాన్య రాష్ట్రాలే కేంద్రంగా ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని ప్రధాని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

# పీవోకేపై రాజ్‌నాథ్ సింగ్ సంచలన వ్యాఖ్యలు..



న్యూఢిల్లీ: భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు ఇప్పుడిప్పుడే తగ్గుముఖం పడుతున్నాయి. అయితే కాల్పుల విరమణకు ఒప్పుకున్న ఇండియా.. శత్రుదేశాన్ని మాత్రం వదలడం లేదు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాక్ నిజస్వరూపాన్ని ప్రపంచ దేశాల ముందు బయటపెడుతోంది. అఖిలపక్ష ఎంపీల బృందాన్ని విదేశాలకు పంపించిన మోదీ సర్కారు.. పాక్ కుట్రలు, కుతంత్రాలను బట్టబయలు చేస్తోంది. అన్ని వైపుల నుంచి శత్రుదేశాన్ని అష్టదిగ్బంధం చేసేందుకు ప్రయత్నిస్తోంది. మూడు చెరువుల నీళ్లు తాగిస్తూ.. మనతో పెట్టుకోవాలంటే వణికేలా చేస్తోంది. ఈ తరుణంలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ మనదేనని ఆయన అన్నారు. అక్కడి ప్రజలు భారత్‌లో విలీనం కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. అతి త్వరలో పీవోకేను స్వాధీనం చేసుకుంటామని స్పష్టం చేశారు.పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని ప్రజలు మన కుటుంబసభ్యులన్ని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. భౌగోళికంగా వేరు పడినా వారు ఎప్పటికైనా ఇండియాలో కలుస్తారని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో భారత్ చాలా బలంగా ఉందన్నారు. పీవోకేలోని చాలా మంది ప్రజలు ఇండియాలో కలవాలని కోరుకుంటున్నారని రాజ్‌నాథ్ వ్యాఖ్యానించారు. కొంతమంది మాత్రమే దీనిని వ్యతిరేకిస్తున్నారని ఆయన వివరించారు. పీవోకే ప్రజలు ఏదో ఒక రోజు భారత్‌లో ఏకమవుతారని.. ఆ రోజు ఎంతో దూరంలో లేదన్నారు. పీవోకే దానంతట అదే వస్తుందని.. అక్కడున్న వారికి ఇండియాతో దృఢమైన బంధాలు ఉన్నాయని రక్షణ మంత్రి పేర్కొన్నారు. పీవోకేలోని మెజారిటీ ప్రజలు భారత్‌లో కలవాలని కోరుకుంటున్నారని.. కొందరు మాత్రమే తప్పుదారి పట్టారని చెప్పుకొచ్చారు. మనం ఏదైనా చేయగలమని.. అయితే శక్తితో పాటు సంయమనం కూడా చాలా అవసరమని స్పష్టం చేశారు రాజ్‌నాథ్. మేకిన్ ఏంటో ఆపరేషన్ సిందూర్‌తో అందరూ గ్రహించారని వ్యాఖ్యానించారు. ఫైటర్ జెట్లు, మిసైల్ సిస్టమ్స్ నిర్మించడంతోపాటు అధునాతన యుద్ధ సాంకేతికతలను అభివృద్ధి చేయడం మీద దృష్టిపెట్టామని రాజ్‌నాథ్ సింగ్ చెప్పుకొచ్చారు.

# రాయలసీమ అడ్డా..టిడిపి గడ్డ




**దేవుని గడపలో మహానాడు సూపర్ సక్సెస్**
**వైనాట్ 175 అంటే..ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదు**
**తాడేపల్లి ప్యాలెస్‌కే జగన్‌ను పరిమితం చేశారు**
**ఇచ్చిన హామీలు అమలు చేస్తూ పోతాం**
**త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం**
**అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా తయారు చేసిన జగన్**
**రెడ్‌బుక్ అంటేనే వణికిపోతున్న నేతలు**
**కడప బహిరంగ సభలో లోకేశ్ ఘాటు వ్యాఖ్యలు**

కడప,మే29 దేవుని కడపలో మహానాడు నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నానని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ అన్నారు. తిరుమల తొలి గడప.. దేవుని కడప. దేవుని కడప, ఒంటిమిట్ట, అమీన్‌పీర్ దర్గా ఉన్న పుణ్యభూమి. పౌరుషం, ఆత్మీయత, మహిళలను గౌరవించడం నేర్చుకోవాల్సిన గడ్డ ఇది. మాస్ జాతర మహానాడు అదిరిపోయింది. పౌరుషాల గడ్డపై పసుపు జెండా రెప రెపలాడుతోందని అన్నారు. మహానాడు బహిరంగ సభలో తన ప్రసంగంతో పార్టీ శ్రేణుల్లో ఉత్తేజం నింపారు. 2024లో మాస్ విక్టరీ మనందరం చూశాం. 94 శాతం స్ట్రయిక్ రేట్‌తో చరిత్రను తిరగరాశాం. ఇది తెలుగుదేశం పార్టీ కార్యకర్తల నాటు దెబ్బ. జెండా పీకేస్తాం అన్నారు, పార్టీ లేకుండా చేస్తామన్నారు.. కానీ వారే అడ్రస్ లేకుండా పోయారు. వై నాట్ 175 అన్నారు.. వారికి ప్రజలు ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదని నారా లోకేశ్ అన్నారు. 175 నియోజకవర్గాలకు గాను 164 సాధించాం ఇది ఆల్ టైం రికార్డ్ అని పేర్కొన్నారు. జెండా పీకేస్తాం అన్నారు.. ఇప్పుడు వాళ్ళ పార్టీ ఆఫీసుకు టూలేట్ బోర్డు పెట్టారని ఆరోపించారు. మన బొమ్మలు పెట్టి బాక్సింగ్ చేశారు.. ప్రజలు ఇప్పుడు ఫుట్‌బాల్ అడుకునే పరిస్థితి వచ్చింది. ఏ తప్పూ చేయని మన అధినేత చంద్రబాబును జైల్లో పెడితే.. ప్రజలు జగన్‌ను తాడేపల్లి ప్యాలెస్‌లో పెట్టి లాక్ చేశారు. మన నాయకులు ట్రెండ్ ఫాలో అవ్వరు.. ట్రెండ్ సెట్ చేస్తారు. అది సినిమా స్క్రీన్ అయినా..పొలిటికల్ స్క్రీన్ అయినా.. ఆయన ఒక లెజెండ్. ఎన్టీఆర్ అంటే మూడు అక్షరాలు కాదు.. ఒక ప్రభంజనం. ఆయనే రాముడు, కృష్ణుడు, అర్జునుడు, భీముడు, కర్ణుడు అంటూ గంభీరఉపన్యాం ఇచ్చారు. సీబీఎన్ అంటే ప్రజలందరికీ ధైర్యం. అభివృద్ధి వికేంద్రీకరణ అనేది మన అజెండా. గత ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌ను అప్పుల ప్రదేశ్‌గా మార్చింది. కొత్త పరిశ్రమలు తీసుకురాకపోగా..పక్క రాష్ట్రానికి పంపారు. ప్రమాదకర మద్యంతో 30వేల మందిని పొట్టన పెట్టుకున్నారు. గత ప్రభుత్వం మద్యం ద్వారా రూ.వేల కోట్లు లూటీ చేసింది. రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు కూటమి ఏర్పడింది. ప్రజలు కూటమిని ఆశీర్వదిస్తే ప్రజా ప్రభుత్వం ఏర్పడింది. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా ప్రతి హామీ నిలబెట్టుకుంటున్నాం అని లోకేశ్ తన ప్రసంగంలో పేర్కొన్నారు.అప్పుడు హైటెక్ సిటీ ఇప్పుడు క్వాంటం హాలీ అని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. ఇక, నా పైన కూడా 23 కేసులు పెట్టారు.. తగ్గేదే లేదు అని ఆనాడే చెప్పాం.. విధ్వంసం పాలనలో రాష్ట్రం తీవ్రంగా నష్టపోయింది..

# సిట్ కస్టడీకి లిక్కర్ స్కామ్ నిందితులు..



అమరావతి మే 29:లిక్కర్ స్కామ్‌లో నిందితులను తమ కస్టడీకి అప్పగించాలంటూ ఏసీబీ కోర్టులో సిట్ అధికారులు పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో నిందితులు కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డిని మూడు రోజులు.. అలాగే ధనుంజయ రెడ్డి, కృష్ణ మోహన్ రెడ్డి, బాలాజీ గోవిందప్పలను వారం రోజుల పాటు తమ కస్టడీకి అప్పగించాలంటూ పిటిషన్‌లో పేర్కొన్నారు. పిటిషన్‌పై వాదనలు పూర్తికావడంతో ఏసీబీ కోర్టు నేడు తీర్పును వెల్లడించింది. నలుగురు నిందితులను రెండు రోజుల పాటు కస్టడీకి అనుమతించింది. రేపు, ఎల్లుండి ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విచారించేందుకు సిట్ అధికారులకు అనుమతించింది. కాగా, ఏపీ లిక్కర్ స్కాంపై పూర్తిగా దర్యాప్తు చేయాలని కూటమి ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేసింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగానే కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డిని అరెస్ట్ చేశారు. అతడు చెప్పిన వివరాలు ఆధారంగా తర్వాత విశ్రాంతి ఐఏఎస్ అధికారి ధనుంజయ్ రెడ్డి, మాజీ సీఎం జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డిలతోపాటు బాలాజీ గోవిందప్పను పోలీసు అధికారులు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. అయితే, వీరిని తమ విచారణకు అప్పగించాలంటూ సిట్ అధికారులు ఏసీబీ కోర్టును ఆశ్రయించారు. అయితే, ఇప్పటికే కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డిని సిట్ అధికారులు ఒకసారి కస్టడీకి తీసుకుని విచారించారు. అయితే, మరోసారి అతడిని తమ కస్టడీకి అప్పగించాలంటూ సిట్ అధికారులు కోర్టులో పిటిషన్ దాఖలు చేయడంతో నిందితులను రెండు రోజుల కస్టడికి అనుమతించింది.

# సంపాదకీయం

## భారీగా పెరుగుతున్న డిఫెన్స్ ఆర్డర్లు

ఆపరేషన్ సిందూర్ తర్వాత భారతదేశంపై ప్రపంచ దేశాల వైఖరి ఒక్కసారిగా మారిపోయింది.. అమెరికా లాంటి దేశం కూడా మన గురించి ప్రత్యేకంగా ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది.. ఇక ఇతర దేశాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.ఆపరేషన్ సిందూర్ ద్వారా మన సాయుధ సంపత్తి.. ఆయుధ సామర్థ్యం ప్రపంచానికి సరికొత్తగా తెలిసింది. ఇక ఉగ్రవాద దేశం పాక్ కు ఐతే ఎన్నో విధాలుగా నష్టం జరిగింది. ఉగ్రవాద స్థావరాలు నేలకూలిపోయాయి. విలువైన జలాలు ఆగిపోయాయి. పంట పొలాలు ఎండిపోతున్నాయి. తినడానికి తిండి గింజలు కరువయ్యాయి. మొత్తంగా చెప్పాలంటే తాగడానికి కూడా ఇప్పుడు అక్కడ నీరు లేదు. దేహి అంటూ చివరికి మన పాదాల మీద పడాల్సిన పరిస్థితి అక్కడి ప్రజలకు ఏర్పడింది. ఇప్పటికే నీటి కోసం మన దేశానికి ఉగ్రవాద దేశం అనేకసార్లు లేఖలు రాసింది. అయినప్పటికీ భారత్ ఏ మాత్రం పట్టించుకోవడం లేదు.ఆపరేషన్ సిందూర్ మనకు అనేక ప్రయోజనాలను అందించింది. ఇందులో ఒకటి శత్రుదేశంలో దాక్కుని ఉన్న ముష్కరులను సర్వనాశనం చేయగా.. మరపక మన ఆయుధాల పనితీరు ఎంత కచ్చితంగా ఉన్నాయో ప్రపంచానికి తెలిసాయి. కేవలం ఫారిన్ కంట్రీస్ వెపన్స్ మీద ఆధారపడకుండా.. వాటికి ఇండియన్ టెక్నాలజీ జత చేయడం వల్ల ఊహించిన దానికంటే ఎక్కువ ఫలితాలు వచ్చాయని డిఫెన్స్ నిపుణులు చెబుతున్నారు. ఇజ్రాయిల్ నుంచి ఇండియన్ డిఫెన్స్ సంస్థ అయినటువంటి నైబీ లిమిటెడ్ కు భారీ ఆర్డర్ ఇచ్చింది. యూనివర్సల్ రాకెట్ లాంచర్లను సరఫరా చేయాలని కోరింది. ఈ ఆర్డర్ విలువ 150 కోట్లుగా ఉంటుందని తెలుస్తోంది. గడచిన కొన్ని వారాలుగా నేషనల్ డిఫెన్స్ స్టాక్ పై ఇన్వెస్టర్లు ఫోకస్ చేస్తున్నారు. ఈ క్రమంలో తాజా డీల్ వల్ల నైబ్ కంపెనీ షేర్ల ధర ఏకంగా 5% గ్రోత్ రిజిస్టర్ చేసింది. స్మాల్ క్యాప్ డిఫెన్స్ కంపెనీ స్టాక్ ధర ప్రస్తుతం ఒక్కొక్కటి 1602 రూపాయల వద్ద ట్రేడింగ్ సాగింది. గడిచిన 52 వారాల గరిష్ట ధర 2045 గా ఉన్న విషయం విధితమే. నైబీ సంస్థ పూణే కేంద్రంగా కార్యకలాపాల సాగిస్తోంది. 300 కిలోమీటర్ల రేడియస్ లో పనిచేయగలగే రాకెట్ లాంచర్లను తయారు చేయడం ఈ సంస్థ కున్న ప్రత్యేకత. ఈ కంపెనీ ఇజ్రాయిల్ దేశానికి రాకెట్ లాంచర్లను 2027 నవంబర్ మూడు నాటికి అందజేయాల్సి ఉంటుంది. అయితే ఈ లాంచర్లను ఏ సంస్థ డెలివరీ అందుకుంటున్నదో.. ఆ వివరాలను నైబీ సంస్థ గోప్యంగా ఉంచింది. ఇక కంపెనీ రిసీవ్ చేసుకున్న ఆర్డర్ ప్రపంచ స్థాయిలో అతెంటిఫికేషన్ ఇస్తుందని.. బిజినెస్ గ్రోత్ కు ఉపయోగపడుతుందని డిఫెన్స్ వర్గాలు అంటున్నాయి. ఇక దేశంలోని మొట్టమొదటిసారిగా నైబి సంస్థ వరల్డ్ మార్కెట్లో పాగా వెయ్యడానికి హైటెక్ యూనివర్సల్ రాకెట్ లాంచర్ లు తయారు చేస్తోంది. గడచిన ఐదు సంవత్సరాలలో నైబీ సంస్థ 16వేల శాతం రాబడిని ఇన్వెస్టర్లకు అందించింది. జూన్ 2020లో ఈ సంస్థ స్టాక్ ధర ఒక్కొక్కటి 9.93 గా ఉండటం విశేషం. కానీ ప్రస్తుతం అది 1600 పెరిగిపోయింది. ఇక గడిచిన నెలల కాలంలో స్టాక్ గ్రోత్ 18% పెరిగింది.భారత్ రక్షణ రంగంలో స్వావలంబన సాధించడానికి కావేరి ఇంజిన్ ప్రాజెక్ట్ ఒక కీలకమైన ప్రయత్నం. 1980లలో ప్రారంభమైన ఈ ప్రాజెక్ట్, స్వదేశీ ఫైటర్ జెట్ ఇంజిన్‌ను అభివృద్ధి చేసి, విదేశీ దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించాలనే లక్ష్యంతో ముందుకు సాగింది. సోషల్ మీడియాలో హ్యాష్‌ట్యాగ్ ద్వారా రక్షణ నిపుణులు, ఔత్సాహికులు, సామాన్య పౌరులు ఈ ప్రాజెక్ట్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ ఉద్యమం భారత వాయుసేన సాంకేతికతలో ఆత్మనిర్భరత సాధించే దిశగా ఒక బలమైన పిలుపునిస్తోంది.కావేరి ఇంజిన్‌ను రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలోని గ్యాస్ టర్బైన్ రీసెర్చ్ ఎస్టాబ్లిష్మెంట్ అభివృద్ధి చేసింది. ఈ లో?బైపాస్, ట్విన్?స్పూల్ టర్బోఫ్యాన్ ఇంజిన్‌ను 80 కిలో న్యూటన్ల థ్రస్ట్ ఉత్పత్తి చేసేలా రూపొందించారు, ప్రధానంగా లైట్ కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ తేజస్‌కు శక్తినిచ్చేందుకు. అయితే, థ్రస్ట్ లోపాలు, బరువు సమస్యలు, అణ్వస్త్ర పరీక్షల వల్ల విధించిన అంతర్జాతీయ ఆంక్షలు ఈ ప్రాజెక్ట్‌ను ఆలస్యం చేశాయి. ఫలితంగా, తేజస్ విమానాలు అమెరికా జనరల్ ఎలక్ట్రిక్ ఈ404 ఇంజిన్లను ఉపయోగించాయి.కావేరి ఇంజిన్ ప్రాజెక్ట్ అనేక సాంకేతిక సవాళ్లను ఎదుర్కొంది. ఏరోథర్మల్ డైనమిక్స్, సింగిల్ క్రిస్టల్ బ్లేడ్ తయారీ, స్మార్ట్ కంట్రోల్ సిస్టమ్ వంటి అధునాతన సాంకేతికతల అభివృద్ధిలో భారత్‌కు అనుభవం తక్కువగా ఉంది. నైపుణ్యం కలిగిన మానవ వనరుల కొరత, పశ్చిమ దేశాల సాంకేతిక ఆధిపత్యం కూడా ప్రధాన అడ్డంకులుగా నిలిచాయి. అయినప్పటికీ, ఇటీవలి సంవత్సరాల్లో ఈ ప్రాజెక్ట్‌లో గణనీయమైన పురోగతి సాధించారు. కావేరి డెరివేటివ్ ఇంజిన్ కిలో న్యూటన్ల డ్రై థ్రస్ట్‌ను సాధించి, 2024లో ఫ్లైట్ టెస్టింగ్‌కు అనుమతి పొందింది. ఈ ఇంజిన్‌ను మానవ రహిత యుద్ధ విమానం 'ఘాతక్'లో ఉపయోగించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో హ్యాష్‌ట్యాగ్ ట్రెండింగ్‌లో నిలిచింది, ఇది భారత పౌరులు, రక్షణ నిపుణులు, ఔత్సాహికుల ఏకగ్రీవ ఆకాంక్షను ప్రతిబింబిస్తోంది. ఈ ఉద్యమం భారత్‌ను విదేశీ ఇంజిన్లపై ఆధారపడకుండా చేయడం, జాతీయ భద్రతను బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. రక్షణ మంత్రి రాజనాథ్ సింగ్ ఏప్రిల్ 30, 2025న కావేరి ప్రాజెక్ట్‌కు అదనపు నిధులను ప్రకటించడంతో ఈ ఉద్యమం మరింత ఊపందుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ట్యాగ్ చేస్తూ, ఈ ప్రాజెక్ట్‌కు మరింత నిధులు, వనరులు కేటాయించాలని నెటిజన్లు కోరుతున్నారు. కొందరు ఈ ప్రాజెక్ట్ కోసం ఉచిత పథకాల నిధులను తగ్గించాలని సూచించారు, ఇది జాతీయ ప్రయోజనాలకు ఎంత ముఖ్యమో సూచిస్తుంది.కావేరి ఇంజిన్‌ను మరింత శక్తివంతంగా, ఆధునికంగా తీర్చిదిద్దేందుకు భారత్ ఫ్రాన్స్‌లోని సాఫ్రాన్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుంది.

# హస్తినతో బంధాలు తెగినట్టేనా

విజయవాడ, మే 29, వైసీపీ అధినేత వైఎస్ జగన్ కు ఢిల్లీలో పట్టు పోయినట్లు పైకి మాత్రం కనిపిస్తుంది. నిన్న మొన్నటి వరకూ అధికారంలో ఉన్నప్పుడు వైఎస్ జగన్ తరచూ ఢిల్లీ వెళ్లేవారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అభివృద్ధి పనుల గురించి ప్రధాని నరేంద్ర మోదీతో పాటు కేంద్ర మంత్రులు అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లు కలసి వచ్చేవారు. ఢిల్లీ పెద్దలు కూడా జగన్ ను ఆదరించేవారు. నాడు అధికారంలో ఉన్నప్పుడు అందరితో పరిచయాలు పెంచుకుని కొన్ని ప్రాజెక్టులను కూడా ఏపీకి తేగలిగారు. దీంతో పాటు తనకు నాడు మిథున్ రెడ్డి, విజయసాయిరెడ్డి ఢిల్లీలో ఉండి అన్ని రకాలుగా కొంత సహకారం అందించేవారు. జగన్ ఐదేళ్లలో అనేక సార్లు ఢిల్లీకి వెళ్లి మోదీని కలిసి వచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా జగన్ ను ఆప్యాయంగా పలకరించేవారు. దగ్గరకు తీసుకునే వారు. అలాంటి జగన్ గత ఎన్నికల్లో ఓటమి పాలయిన తర్వాత ఢిల్లీ గడప తొక్కలేదు. ఢిల్లీతో కనెక్షన్ కట్ అయింది. ఎన్నికలకు ముందే బీజేపీతో చంద్రబాబు, పవన్ కల్యాణ్ పొత్తు పెట్టుకోవడంతో ఢిల్లీకి ఉన్న సంబంధాలు దాదాపు తెగిపోయాయి. జగన్ ను ఢిల్లీలో పట్టించుకునే వారే లేరు. అదే సమయంలో ఢిల్లీలో తన పార్టీ తరుపున లాబీయింగ్ చేసే వారు కూడా లేరు. విజయసాయిరెడ్డి కూడా పార్టీని వీడి వెళ్లిపోవడంతో ఇక ఢిల్లీలో పెద్దలను కలసి మాట్లాడే వారే లేరు. జగన్ నేరుగా వెళ్లి కలిసే పరిస్థితి లేదు. అదే సమయంలో ఢిల్లీ పెద్దలు ఇంకా జగన్ పట్ల కొంత సాఫ్ట్ కార్నర్ తోనే ఉన్నారన్న ప్రచారం జరుగుతుంది. జగన్ మళ్లీ పుంజుకునే అవకాశాలున్నాయన్న సమాచారంతో ఢిల్లీ పెద్దలు పెద్దగా జగన్ ను టార్గెట్ చేయడం లేదన్న అభిప్రాయం అందరిలోనూ వ్యక్తమవుతుంది. జగన్ కు ప్రజల్లో ఉన్న అభిమానం, గత ఎన్నికల్లో నలభై శాతం ఓట్లు రావడంతో జగన్ ను సులువుగా వదులుకునేందుకు సిద్ధంగా లేరు. అందుకే ప్రధాని నరేంద్ర మోదీ నుంచి కేంద్ర మంత్రుల వరకూ చంద్రబాబు నాయుడును, పవన్ కల్యాణ్ ను పొగుడుతున్నారు తప్పించి, జగన్ ను మాత్రం పన్నెత్తుమాట అనడం లేదన్న కామెంట్స్ హస్తినలో వినిపిస్తున్నాయి. జగన్ తమకు బయట నుంచి మద్దతు ఇస్తుండటంతో పరోక్షంగా కొంత మేలు చేసే ఉద్దేశ్యంతోనే ఢిల్లీ పెద్దలున్నారని, హాని మాత్రం తలపెట్టరన్న వ్యాఖ్యలు రాజకీయంగా వినిపిస్తున్నాయి. జగన్ కూడా అదే ధైర్యంతో ఉన్నారని తెలిసింది. .. అయితే ఆంధ్రప్రదేశ్ మద్యం స్కామ్ కేసులో ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ అధికారులు విచారణ చేస్తున్నప్పటికీ అది తూతూ మంత్రమేనంటున్నారు. ఇందులో జగన్ పార్టీని పెద్దగా ఇబ్బందులు పెట్టే అవకాశం లేకపోవచ్చు. కూటమిలోని మిత్ర పక్షాలైన టీడీపీ, జనసేన పార్టీలను సంతృప్తి పర్చడానికే ఈడీ మద్యం కేసులో విచారణను ఈడీ ప్రారంభించిందని, అంతే తప్ప ఈ విషయంలోనూ జగన్ కు పెద్దగా నష్టం జరిగే అవకాశం లేదని అంటున్నారు. ఎందుకంటే జగన్ తో భవిష్యత్ అవసరాల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేసే ఛాన్స్ కూడా లేదన్నది విశ్లేషకుల అంచనా. మొత్తం మీద హస్తిన జగన్ పక్కనే ఉందన్న కామెంట్స్ సోషల్ మీడియాలో ఎక్కువగా వినిపిస్తున్నాయి.

# అన్నదాత సుఖీభవ పై ఫుల్ క్లారిటీ

నెల్లూరు, మే 29, (న్యూస్ పల్స్)అన్నదాత సుఖీభవ పై ఫుల్ క్లారిటీ వచ్చింది. రైతులకు ఏటా పెట్టుబడి సాయంగా 20 వేల రూపాయలు అందించే అన్నదాత సుఖీభవ పథకం అమలుపై స్పష్టత ఇచ్చింది ఏపీ ప్రభుత్వం. కడప మహానాడు వేదికగా అన్నదాత సుఖీభవ పథకం ఎప్పుడు అమలు చేస్తామనే విషయాన్ని సీఎం చంద్రబాబు ప్రకటించారు. పిఎం కిసాన్ యోజన తొలి విడత నగదు పడిన సమయంలోనే అన్నదాత సుఖీభవ తొలి విడత సాయం అందిస్తామని చంద్రబాబు క్లారిటీ ఇచ్చారు. అదే సమయంలో మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం ఆగస్టు 15 నుంచి ప్రారంభిస్తామని కూడా వెల్లడించారు. సీఎం ప్రకటనతో రైతుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. ఖరీఫ్ ప్రారంభం నాటికి తమకు తొలి విడత అన్నదాత సుఖీభవ నిధులు అందుతాయని వారు నమ్మకం పెట్టుకున్నారువైయస్ జగన్మోహన్ రెడ్డి 2019లో నవరత్నాల పథకంలో భాగంగా రైతు భరోసా పథకానికి హామీ ఇచ్చారు. అధికారంలోకి వస్తే ఏడాదికి 15000 రూపాయలు పెట్టుబడి ప్రోత్సాహంగా అందిస్తామని హామీ ఇచ్చారు. అయితే తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వపరంగా 7500 కు మాత్రమే పరిమితం అయ్యారు. కేంద్రం అందించే పీఎం కిసాన్ 6000 రూపాయల నగదు తో పాటు 13,500 అందించారు. అయితే తాము అధికారంలోకి వస్తే సాగు సాయం కింద ఏటా 20వేల రూపాయల సాయం అందిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ హామీని అమలు చేసేందుకు ఇప్పుడు పూర్తిస్థాయిలో దృష్టి పెట్టారు. అయితే కేంద్రం అందించే 6000 రూపాయల మొత్తానికి.. మరో 14 వేల రూపాయలను జతచేస్తూ.. 20000 అందించేందుకు నిర్ణయించడం విశేషం జూన్ నెలలో అన్నదాత సుఖీభవ తో పాటు తల్లికి వందనం పథకం అమలు చేస్తామని ఇదివరకే సీఎం చంద్రబాబు ప్రకటించారు. అయితే ఇప్పుడు తల్లికి వందనం నగదును జమ చేసేందుకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. మరోవైపు అన్నదాత సుఖీభవ పథకం తొలి విడత సొమ్ము విడుదలకు సైతం సన్నాహాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. మహానాడు వేదికగా సీఎం చంద్రబాబు దీనిపై ప్రకటన చేశారు. కేంద్రం అందించే పీఎం కిసాన్ తొలి విడత రెండు వేల రూపాయలతో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి ఐదువేల రూపాయల మొత్తాన్ని కలిపి అందిస్తామని చెప్పుకొచ్చారు. అయితే సాధారణంగా కేంద్ర ప్రభుత్వం ప్రతి నాలుగు నెలలకు ఒకసారి పిఎం కిసాన్ నిధులను విడుదల చేస్తోంది. ఈ లెక్కన జూన్ మూడో వారంలో పిఎం కిసాన్ అందించేందుకు సన్నాహాలు ప్రారంభించింది. రాష్ట్ర ప్రభుత్వ వాటా సైతం అప్పుడే అందించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోందిమరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరుగుతుంది. అధికార యంత్రాంగం అర్హులను గుర్తించే పనిలో పడింది. అర్హుల జాబితా సిద్ధమయ్యాక పీఎం కిసాన్ యోజన నిధులు విడుదల సమయంలోనే అన్నదాత సుఖీభవ నిధులు కూడా విడుదల కానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా దరఖాస్తుల నమోదు ప్రక్రియలు అధికారులు బిజీగా ఉన్నారు. అర్హుల జాబితా కొలిక్కి వచ్చిన తర్వాత ప్రభుత్వానికి నివేదించనున్నారు. అదే సమయంలో పీఎం కిసాన్ నిధులు జమ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తద్వారా జూన్ మూడో వారంలో అన్నదాత సుఖీభవ నిధులు జమ అయ్యే పరిస్థితి కనిపిస్తోంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.నిబంధనలుఏపీకి చెందిన రైతులు మాత్రమే అర్హులు. ఐదు ఎకరాల్లోపు చిన్న సన్న కారు రైతులు అర్హులు. లబ్ధిదారు వయసు విధిగా 18 సంవత్సరాలు నిండి ఉండాలి. భూమికి సంబంధించి పక్కా పత్రాలు, పట్టాదారు పాసుబుక్ తప్పనిసరి. రైతు పేరుతో ఆధార్తో అనుసంధానమై ఉండాలి. రైతు పండించే పంటల వివరాలను నమోదు చేయాలి. భూమిని లీజుకు తీసుకున్న కౌలు రైతులకు కూడా ఈ పథకానికి అర్హులు. తప్పనిసరిగా కౌలు రైతు ధ్రువీకరణ పత్రం ఉండాలి. పిఎం కిసాన్ పథకానికి అర్హులైన వారంతా అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులే.కేవలం సొంత భూమి కలిగిన వారికే కాకుండా కౌలు తీసుకుని వ్యవసాయం చేసుకున్న వారికి సైతం ఈ పథకం వర్తిస్తుంది. అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తించేలా ఏపీ ప్రభుత్వం మార్గదర్శకాలను సైతం విడుదల చేసింది. అయితే కౌలు రైతు ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఆదాయ పన్ను చెల్లించిన వారికి అన్నదాత సుఖీభవ పథకం వర్తించదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు ఈ పథకానికి అనర్హులు. ప్రజా ప్రతినిధులకు సైతం ఈ పథకం వర్తించదు. పదివేల రూపాయల కంటే ఎక్కువ పింఛను పొందే వారికి అన్నదాత సుఖీభవ వర్తించదు. కేవలం కుటుంబాన్ని యూనిట్గా తీసుకుని అమలు చేయనున్నారు. అందుబాటులోకి వెబ్సైట్.. ష్టబిబిజూబ://జీనినిజీటజీబిష్టబీబీఎష్టతిఎష్టజీలజీ ప్రత్యేక వెబ్సైట్ ఉంటుంది. అందులో మన స్టేటస్ కూడా చెక్ చేసుకోవచ్చు. రైతు ఆధార్ కార్డు, పట్టాదార్ పాస్ బుక్ వంటి భూమి పత్రాలు, బ్యాంక్ పాస్ బుక్, మొబైల్ నెంబర్, భూమి వివరాలు, రైతుల పాస్పోర్ట్ సైజ్ ఫోటో, ఆధార్ కార్డు నెంబర్ను బ్యాంకు ఖాతాలో అనుసంధానం చేసుకొని ఉండాలి. అర్హులైన రైతులు తమ ఆధార్ కార్డు, భూమి పాసుబుక్, బ్యాంక్ పాస్ బుక్ తదితర పత్రాలతో రైతు సేవా కేంద్రంలో అధికారులను సంప్రదించాలి. అక్కడ సిబ్బందికి వివరాలను అందించాలి. అధికారులు రైతులు సమర్పించిన పత్రాలను పరిశీలించి, వివరాలను ధృవీకరించుకొని సదరు రైతు పేరును లబ్ధిదారుల జాబితాలో చేర్చేందుకు సిఫారసు చేస్తారు. రైతు సేవా కేంద్రాల వారిగా నమోదైన వ్యాపిల్యాండ్ డాటాను ఉన్నతాధికారులు పరిశీలించి.. అర్హులైన వారికి అన్నదాత సుఖీభవ లబ్ధిదారుల జాబితాలో చేరుస్తారు.

# కాకాణిపై తప్పుడు కేసులు

నెల్లూరు,మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి కుమార్తె పూజిత రెడ్డి నెల్లూరు జిల్లా వైసీపీ పార్టీ కార్యాలయం లో మీడియా సమావేశం నిర్వహించారు..ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన తండ్రి అక్రమ అరెస్ట్ పై మాట్లాడేందుకు మీడియా ముందుకు వచ్చాను...తన తండ్రి నిజాయితీ వ్యక్తిత్వం గురించి ప్రజలకు తెలుసు...అభివృద్ధి,ప్రజల సంక్షేమం తప్ప వేరే ఆలోచన చేయకుండా ఉండే వ్యక్తి మా నాన్న..కోవిడ్ సమయం లో ప్రజల కోసం 24 గంటలు కష్టపడి పనిచేశారు..జడ్పీ చైర్మెన్ గా పని చేసి ఆ పదవికే వన్నె తెచ్చిన వ్యక్తి,రెండు సార్లు ఎమ్మెల్యే గా ఒక సారి మంత్రిగా పనిచేసిన వ్యక్తి,నాకు ఎవరన్నా ఫోన్ చేసినా మా నాన్న ప్రజల కోసం పనిచేసే వ్యక్తి నేరుగా వెళ్ళి 24 గంటల్లో ఎప్పుడైనా ప్రజలు కలిసే అవకాశం ఉండేది..కింది స్థాయి నుండి పైకి వచ్చిన వ్యక్తి కాబట్టి ఆయనకు ప్రజల కష్టాలు తెలుసు...మా తాత గారి నుండి నిజాయితీగా రాజకీయాలు చేస్తున్నాం..తప్పుడు కేసులు పెట్టి అక్రమంగా అరెస్ట్ చేసి మా నాన్న ను కష్టాలు పెట్టడం సరికాదు ...నియోజక వర్గంలో ప్రజలు చాలామంది ఫోన్ చేసి గోవర్ధన్ రెడ్డి పై తప్పుడు కేసులు పెడతారు అని చెప్పేవారు...మా నాన్న పై చాలా దుష్ప్రచారాలు జరుగుతున్నాయి,ఇది బాధాకరం.. కేసులు అనేవి మా నాన్నకు కొత్త కాదు..ఎన్నో సార్లు కేసులు పెట్టినా పోలీసు విచారణ కు హాజరు అయ్యేవారు,న్యాయ స్థానం లో బెయిల్ పిటిషన్ రన్ అవుతుంది కాబట్టి న్యాయ స్థానం తీర్పు కోసం ఎదురుచూసాం,సుప్రీం కోర్టులో మేమే కేసు కొన్ని సాంకేతిక కారణాలు వలన వెనక్కు తీసుకున్నాం తప్ప బెయిల్ పిటిషన్ కొట్టేయలేదు...కాల చక్రం బలమైంది,ఈ రోజు మా సమయం కాక పోవచ్చు కానీ మాకు ఓ రోజు వస్తుంది,ఎన్ని ఇబ్బందులు వచ్చినా నాయకులు,కార్యకర్తలు మాతోనే వున్నాయి,మాతో కలిసి ఉన్న అందరికీ ధన్యవాదాలు..మా నాన్న అరెస్ట్ అయినప్పటి నుండి జిల్లా ప్రజలు,సర్వేపల్లి నియోజక ప్రజలు, వైసిపి పార్టీ లోని అందరూ మాకు అండగా ఉన్నారు,కడిగిన ముత్యం లా మళ్ళీ మా నాన్న ప్రజల ముందుకు వస్తారు,కార్యకర్తలు కు అందరికీ నేను నిత్యం అందుబాటులో ఉంటానని అన్నారు....

## శ్రీవారిని దర్శించుకున్న నటి శ్రీయ

తిరుమల,తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని ప్రముఖ సినీ కథానాయకి శ్రీయ శరణ్ దర్శించుకున్నారు. గురువారం ఉదయం శ్రీవారిని సుప్ర భాత సేవలో దర్శించుకొని ముక్కు లు చెల్లించుకున్నారు. దర్శనానం తరం ఆలయ రంగనాయకుల మండపంలో వేద పండితుల ఆలయ అధికారులు పట్టు వస్త్రంతో సత్క రించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# ఏరియా ఆసుపత్రిలో తల్లి బిడ్డ విగ్రహం ఏర్పాటు



రామచంద్రపురం, మే 29(శ్రీచక్ర)రామచంద్రాపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో దాతలు సమకూర్చిన తల్లి బిడ్డ విగ్రహంఏర్పాటు చేశారు .ఈమేరకు గురువారం చిలుకూరి సత్యనారాయణ, రామకృష్ణ బ్రదర్స్ ఏర్పాటు చేసిన తల్లి బిడ్డ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం జరిగినది .ఈ కార్యక్రమానికి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్ , డాక్టర్ వీరభద్రం , డాక్టర్ కల్యాణ బాబు ,డాక్టర్ శ్రీనివాస్ , ఆసుపత్రి డెవలప్మెంట్ కమిటీ సభ్యులు జనసేన పట్టణ అధ్యక్షులు గొల్లపల్లి కృష్ణ , ఆంధ్రప్రదేశ్ పారామెడికల్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ , ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జాయింట్ యాక్షన్ కమిటీ ఉపాధ్యక్షులు మాధవరపు వెంకటేశ్వర్లు , రిటైర్డ్ డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ రవీందర్ , ప్రసాద్ , ఏవో , నర్సింగ్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువు మరో మూడు నెలల పొడిగింపు

విజయవాడ, మే 29(శ్రీచక్ర): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువు ముగుస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల కాలపరిమితిని మరో మూడు నెలలు పాటు జూన్ 1, 2025 నుండి ఆగష్టు 31, 2025 వరకు లేదా కొత్త కార్డులు జారీ ప్రక్రియ చేయడం గానీ ఏది ముందు జరిగితే అప్పటివరకు పొడిగింపు ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్ల గురువారం ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం మే 31 నాటికి అక్రిడిటేషన్ కార్డులు పనిచేస్తున్న పాత్రికేయులకు మాత్రమే మరో మూడు నెలలు జూన్ 1, 2025 నుండి ఆగష్టు 31, 2025 వరకు ఈ పొడిగింపు సౌకర్యం వర్తిస్తుందని ఆ ప్రకటనలో సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్ల తెలియజేశారు.

# యాక్షన్... డైరక్షన్...

కడప మే 29, ఆంధ్రప్రదేశ్ లో తెలుగుదేశం పార్టీలో సమూల మార్పులు జరగనున్నాయి. పార్టీ జాతీయ అధ్యక్షుడిగా చంద్రబాబు నాయుడు తిరిగి ఎన్నికయ్యారు ముప్పయి ఏళ్లుగా చంద్రబాబు నాయుడు పార్టీ అధ్యక్ష బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి ఈ ఎన్నికను నిర్వహిస్తుంటారు. 1995లో మొదటి సారి చంద్రబాబు పార్టీ అధినేతగా ఎన్నికయ్యారు. అప్పటి నుంచి ఆయన ఇప్పటి వరకూ ఏకగ్రీవంగా ఎన్నికవుతూ వస్తున్నారు. జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికయిన చంద్రబాబుకు పార్టీ నేతలు, మంత్రులు ఎమ్మెల్యేలు శుభాకాంక్షలు తెలిపారు.అదే సమయంలో కడపలో జరిగే మహానాడు నుంచి జాతీయ ప్రధాన కార్యదర్శి పదవి నుంచి లోకేశ్ కు ప్రమోషన్ దక్కనుంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమించారు. ఇక పార్టీలో తీసుకునే నిర్ణయాలన్నీ లోకేశ్ తీసుకునే అవకాశముంది. చంద్రబాబు డైరెక్షన్ లో పార్టీ నడిచినప్పటికీ ఆయన సూచనలు, సలహాలు తీసుకుంటూ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేయనున్నారు లోకేశ్. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా బాధ్యతలను చేపట్టి రాష్ట్ర వ్యాప్త పర్యటనలు చేస్తూ లోకేశ్ వచ్చే ఎన్నికలకు శ్రేణులను సిద్ధం చేస్తారని కూడా తెలిసింది. ఇప్పుడు కాకపోయినా.. మరొకసమయంలోనైనా పార్టీ పగ్గాలు లోకేశ్ కు అప్పగించాల్సిందే. టీడీపీకి తర్వాత వారసుడు లోకేశ్ మాత్రమే. ఆ క్లారిటీ పదేళ్ల ముందే పార్టీలో వినిపించినా కనిపించలేదు. కానీ మొన్నటి ఎన్నికల్లో సూపర్ విక్టరీ తర్వాత లోకేశ్ కు పార్టీ పగ్గాలు అప్పగించాలన్న నినాదం ఊపందుకుంది. సీనియర్ నేతల నుంచి యువనేతల వరకూ ఒకటే స్లోగన్. లోకేశ్ కు పార్టీలో పూర్తి స్థాయి బాధ్యతలను అప్పగించాలంటూ నేరుగా ప్రకటనలుచేయడం వెనక కూడా చంద్రబాబు ఉన్నారు. పార్టీ అధికారంలో ఉన్నప్పుడే లోకేశ్ కు పగ్గాలు అప్పగించడం మంచిదన్న అభిప్రాయానికి చంద్రబాబు కూడా వచ్చారు. అందులో భాగంగానే వర్కింగ్ ప్రెసిడెంట్ గా చేయనున్నారు.. రానున్న నాలుగేళ్లలో లోకేశ్ క్యాడర్ కు, నేతలకు మరింత దగ్గరయ్యే అవకాశాలను చంద్రబాబు కల్పించనున్నారు. అది పార్టీకి, లోకేశ్ కు కూడా మంచిదే. ఆయన వారితో ఎక్కువ సమయం గడిపే అవకాశం ఉండటంతో పాటు ఆయన టీంతో పార్టీని మరొకసారి అధికారంలోకి తీసుకురాగలిగితే అంతకంటే తండ్రికి కావాల్సింది ఏముంటుంది? అని చంద్రబాబు ఆలోచనగా ఉంది. చంద్రబాబు ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఎక్కువ సమయం పార్టీ కోసం కేటాయించలేకపోతున్నారు. అధికారులతో సమీక్షలు, సమావేశాలతో పాటు ఢిల్లీ చుట్టూ తిరగడంతో పాటు అనేక ముఖ్యమైన సమస్యలను అమరావతి, పోలవరం వంటివి పరిష్కరించాల్సిన సమయంలో పార్టీ పూర్తి బాధ్యతలను లోకేశ్ కు అప్పగించడం మేలన్న నిర్ణయానికి వచ్చారు. నారా లోకేశ్ ఇప్పటికే క్యాడర్ కు, నేతలకు అందుబాటులో ఉంటున్నారు. వారి సమస్యలను పరిష్కరిస్తున్నారు. ప్రత్యేకంగా ఆయనే చూస్తున్నారు. నిర్ణయాలు కూడా లోకేశ్ తీసుకుంటున్నారు. పదవుల ఎంపికలోనూ లోకేశ్ పాత్ర కీలకమనే చెప్పాలి. క్యాడర్ తో మరింత కనెక్ట్ అయ్యేందుకు కేవలం పేరు వెనక ట్యాగ్ మాత్రమే కానీ లోకేశ్ ఆల్రెడీ క్యాడర్ లోనూ, లీడర్లలోనూ పార్టీ అధినేతగా ముద్ర పడిపోయారు.

## జూన్ 4న వెన్నుపోటు దినోత్సవం

## సూపర్ సిక్స్ పథకాలు గాలికి

### జిల్లా అధ్యక్షులు కాటసాని, ఎస్వీ



కర్నూలు, మే 29 (శ్రీచక్ర): కర్నూలు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలోగురువారం కీలక సమావేశం నిర్వహించారు. వెన్నుపోటు దినోత్సవానికి వ్యూహాత్మక దిశా నిర్దేశం మరియు పార్టీ బలోపేతానికి కార్యచరణ పలు సమస్యలపై చర్చించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జూన్ 4వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న "వెన్నుపోటు దినోత్సవం" కు సంబంధించి పార్టీ కార్యకర్తలకు దిశా నిర్దేశం చేయడం కోసం, కర్నూలు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లాస్థాయి ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కర్నూలు పార్లమెంట్ పరిశీలకులు గంగుల ప్రభాకర్ రెడ్డి, ఉమ్మడి కర్నూలు మరియు నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఎస్ వి మోహన్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం వైయస్సార్సీపి నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూఎన్నికల ముందు కూటమినేతలు సూపర్ సిక్స్ పథకాలు చెప్పారు కానీ అమలు చేయలేదు అన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకపోతే చొక్కా పట్టుకోమన్న నాయకులు ఇప్పుడు ఎక్కడ ఉన్నారు. ఏడాది పాలనలో ప్రజలకు ఏ మేలు చేయలేదు, రాష్ట్రంలో రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. తల్లికి వందనం లేదు, అన్నదాత సుఖీభవ అసలే లేదు. సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను బాబు మోసం చేశారు. సూపర్ సిక్స్ పథకాల అమలు కోసం ప్రజలకు జరిగిన మోసంపై జూన్ 4వ తేదీన వెన్నుపోటు దినోత్సవాన్ని నిర్వహిస్తున్నాం. వెన్నుపోటు దినోత్సవం సందర్భంగా ఏడాది పాలనపై ఎండగడతాం అని అన్నారు. ఈ సమావేశంలో కర్నూల్ మేయర్ బివై రామయ్య, ఎమ్మెల్సీ మధుసూదన్, ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి, మాజీ కూడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్చార్జి బుట్టా రేణుక, కోడుమూరు నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## మహానాడుతో రాష్ట్రానికి ఒరిగింది శూన్యం జిల్లా అధ్యక్షులు కాటసాని



కర్నూలు, మే 29(శ్రీచక్ర): కడపలో టీడీపీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహిస్తున్న మహా నాడుతో రాష్ట్రానికి ఒరిగింది శూన్యం.. కేవలం గతప్రభుత్వాన్ని విమర్శించడం, చంద్రబాబుని పొగుడుకోవడంతోనే రెండురోజులు సరిపెట్టారు. గురువారం జిల్లా కార్యాలంలో కాటసాని విలేకర్లతో మాట్లాడారు. జనం లేక "మాయనాడు" వెలవెలబోయింది. వైయస్ఆర్ విగ్రహాల చుట్టూ పచ్చ జెండాలు, తోరణాలు కట్టారు. అభ్యంతరకర రీతిలో వైయస్ విగ్రహాల చుట్టు జెండాలు కట్టి ప్రజల మనోభావాలు దెబ్బతీశారు. కడప ప్రాంత ప్రజల ఎమోషన్ "వైయస్ఆర్". వైయస్ విగ్రహాలకు టీడీపీ తోరణాలు కట్టడం సభ్యత కాదు. కక్ష సాధింపు చర్యలకు పాల్పడలేదని టీడీపీ చెబుతోంది. పోలీసులను అడ్డం పెట్టుకొని కక్ష సాధింపులకు పాల్పడుతూ.. దద్దమ్మ రాజకీయం చేస్తున్నారు. మేం కక్ష సాధింపు రాజకీయం చేసి ఉంటే మీ పరిస్థితి వేరే విధంగా ఉండేది. మాకు తగిలిన దెబ్బ మరిచిపోం. వైయస్ఆర్ను అగౌర పరుస్తున్నారు. టీడీపీ కవ్వింపు చర్యలకు దూరంగా ఉండాలని మా కార్యకర్తలకు తెలిపాం. మేము ఎన్టీఆర్ను అగౌరవ పరచలేదు. చేసిన తప్పులు ఇప్పటికైనా తెలుసుకోండి. అమలు చేయలేని హామీలతో ప్రజలను నమ్మించి ఓట్లు దండుకొని, పథకాలు ఎగ్గొట్టి పండుగ చేసుకుంటున్నారు. ప్రజలకు చేసిన మోసాలకు చివరకు వరుణుడు కూడా ఆగ్రహించారు. ఎన్నికలకు ముందు ప్రజలకు హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు ఏమయ్యాయి? అన్ని రంగాల్లో గత ప్రభుత్వం యువతకు అందించిన ఉద్యోగాలు పీకేసి, గత ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు ప్రారంభించుకుంటూ ఏ ముఖం పెట్టుకొని మహానాడు నిర్వహిస్తున్నారు? జనాలు రాకపోవడంతో డ్వాక్రా సంఘాలు, గ్రామాల్లోని ప్రజలను మహానాడుకు రాకుంటే పథకాలు రావంటూ కొందరు అధికా రులు బలవంతంగా మూడోరోజుకు తరలించే ప్రయత్నం చేస్తున్నారు. మహిళలు, యువతులు మాయమవుతున్నా పవన్ కళ్యాణ్ పట్టించుకోలేదు.. ఒక్కమాట కూడా మాట్లాడలేదు. వైఎస్ జగన్ హయాంలో ప్రజలకు అన్ని పథకాలు అందించారు. కరోనా కష్టకాలం ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలకు కేటాయించిన నిధులు, ఇప్పుడు చంద్రబాబుకేటాయించిన నిధుల గురించి ప్రజలు గమనించాలి. వైయస్ జగన్ పరిపాలన విలువ ఇప్పుడు ప్రజలకు తెలుస్తోంది..

## జగన్నాథ గట్టు పై ప్రభుత్వ భూములను పరిశీలించిన జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా






కర్నూలు, మే 29 (శ్రీచక్ర): జగన్నాథ గట్టు పై ఉన్న ప్రభుత్వ భూములను జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పరిశీలించారు. గురువారం కర్నూలు నగర శివారులోని జగన్నాథగట్టు వద్ద వివిధ సంస్థల ఏర్పాటుకు కేటాయించిన ప్రభుత్వ భూములను, అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జగన్నాథ గట్టు వద్ద టిడ్ కో గృహాలకు, క్లస్టర్ యూనివర్సిటీ కి, ఐఐటీడిఎమ్ కు, ఇతర సంస్థల కోసం కేటాయించిన భూములను పరిశీలించారు. మ్యాపుల ద్వారా వివరాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ సంస్థల ఏర్పాటుకు కేటాయించిన భూములకు సంబంధించి సమగ్రమైన వివరాలతో నివేదిక అందచేయాలని కలెక్టర్ ఆర్డీవో, తహసీల్దార్లు ను ఆదేశించారు. సిల్వర్ జూబ్లీ క్లస్టర్ యూనివర్సిటీ కి సంబంధించి నిర్మాణ పనులకు పెండింగ్ లో ఉన్న పనులను పూర్తి చేసేందుకు నిధుల విడుదల కు చర్యలు తీసుకోవాలని సంబంధిత ఈఈ కలెక్టర్ దృష్టికి తీసుకొని రాగా, మరొక సారి డిఓ లెటర్ సిద్ధం చేసి పంపాలని కలెక్టర్ సిల్వర్ జూబ్లీ క్లస్టర్ ఈఈ ను ఆదేశించారు. అనంతరం కర్నూలు నగర శివారులోని జగన్నాథగట్టు పైన ఉన్న రూపాల సంగమేశ్వర స్వామి ఆలయం , దర్గా లను కలెక్టర్ దర్శించుకొన్నారు. ఇలాంటి టూరిస్ట్ ప్రదేశాలను ప్రజలకు తెలియచేసే విధంగా పెద్ద ఎత్తున పబ్లిసిటీ చేయాలని కలెక్టర్ కర్నూలు ఆర్డీఓ ను ఆదేశించారు. కార్యక్రమంలో కర్నూలు ఆర్డీఓ సందీప్, క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు, కల్లూరు తహసిల్దార్ ఆంజనేయులు, కర్నూలు మండల తహసిల్దార్ రమేష్, క్లస్టర్ యూనివర్సిటీ ఈఈ లక్ష్మి నారాయణ, తదితరులు పాల్గొన్నారు..

## విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో రెండు గేదెలు మృతి, దాదాపుగా ఒక లక్ష ఇరవై వేల రూపాయలు నష్టం,









పెద్దకడబూరు,మే, 29 (శ్రీ చక్ర):- పెద్దకడుబూరు మండల పరిధిలోని జాలవడి గ్రామానికి త్రాగునీటి అవసరాల నిమిత్తం వేసిన బోరుకు విద్యుత్ అధికారులు గ్రామ పంచాయతీకి సంబంధించిన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ను ఏర్పాటు చేయగా ఆ యొక్క పంచాయతీకి సంబంధించిన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ కు అక్రమంగా గత రెండు సంవత్సరాల నుండి పులుసు నరసింహులు అనే వ్యక్తి బోరు బావికే అక్రమంగా విద్యుత్ కనెక్షన్ ను వాడుతున్న ఏ ఒక్క విద్యుత్ అధికారి కూడా పట్టించుకున్న దాఖలాలు లేవు. గ్రామంలో త్రాగునీటి అవసరాల బోరు నీటి సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన పంచాయతీ విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ కు భారీగా అక్రమ కనెక్షన్లు ఉన్నప్పటికీ గాను ఏ ఒక్క విద్యుత్ అధికారి కూడా పట్టించుకున్న దాఖలాలు లేవు. గ్రామంలో త్రాగునీటి అవసరాల నిమిత్తం ఏర్పాటు చేసిన ప్రభుత్వం యొక్క విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ కు పులుసు నరసింహులు అనే వ్యక్తి మామూలుగా ఉండే విద్యుత్ కేబుల్ వైర్లను విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ దగ్గర నుండి ఆయన పొలము గట్టు బావి దగ్గర కరెంట్ పై మోటార్ దగ్గరకు మామూలుగా ఉన్న కేబుల్ వైర్లను లాగడంతో ఆ విద్యుత్ సర్వీస్ వైర్లన్నీ పూర్తిగా డ్యామేజ్ కావడంతో ఆ వైర్లన్నీ నేలపై ఉండడంతో ఒక్కసారిగా అక్కడికి వెళ్లిన రెండు అతి పెద్ద గేదెలు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో చనిపోయాయని బాధితుడు జి.శరణప్ప గౌడ్ విలేకరులకు తెలిపారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు నా యొక్క రెండు గేదలు చనిపోవడంతో వీటి విలువ ఒక లక్ష 20 వేల రూపాయలు పూర్తిగా నష్టపోయినట్లు బాధితుడు అయినా జి.శరణప్ప గౌడ్ విలేకరుల ఎదుట కంటతడి పెట్టి వాపోయారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల రెండు గేదెలు చనిపోవడంతో బాధితుడికి ఒక లక్ష ఇరవై వేల రూపాయలు నష్టం వాటిల్లడంతో ప్రభుత్వం నుండి తక్షణమే విద్యుత్ అధికారులు స్పందించి వెంటనే బాధితుడికి నష్టపరిహారాన్ని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని జాలవడి గ్రామ ప్రజలు కోరుతున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల చనిపోయిన రెండు అతి పెద్ద గేదెలకు పూర్తిగా విద్యుత్ అధికారులే బాధ్యత అని జాలవడి గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి గ్రామంలో ఉండే బోరు,బావులకు ఉండే అక్రమ కనెక్షన్లను తొలగించి గ్రామంలో ఉండే మూగ జీవాలు, మనుషుల యొక్క ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత విద్యుత్ అధికారులపై ఉందని జాలవడి గ్రామ ప్రజలు కోరుతున్నారు. గ్రామంలోని ఇలాంటి నష్టాలను జరగకుండా పూర్తిగా బాధ్యతారహితంగా వ్యవహరించి ఎప్పటికప్పుడు గ్రామ ప్రజలకు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగే ప్రమాదాల గురించి అవగాహన కల్పించాలని జాలవడి గ్రామస్తులు కోరుతున్నారు.

## డ్రోన్స్ సాంకేతికతను పెద్ద ఎత్తున వినియోగించుకోండి

**జిల్లా స్థూల దేశీయోత్పత్తి పెంచేలా చూడాలి**
**జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా**





నంద్యాల,(శ్రీచక్ర)మే 29 :-వ్యవసాయానికి సాంకేతికతను జోడిస్తూ మంచి దిగుబడి ఫలాలు సాధించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి రైతులకు సూచించారు. గురువారం మహానంది మండలం బుక్కాపురం గ్రామంలో నిర్వహించిన వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ వ్యవసాయానికి సాంకేతికతను జోడిస్తూ సకాలంలో పంటకు అవసరమైన రసాయనాలు అందజేయడానికి డ్రోన్స్ ఎంతగానో ఉపయోగపడతాయని వాటిని రైతులు పెద్ద ఎత్తున వ్యవసాయానికి వినియోగించుకోవాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 40 రైతు గ్రూపులకు డ్రోన్స్ అందివ్వడం జరిగిందన్నారు. రైతు ఒక ఎకరా పిచికారీ చేయడానికి 3 నుంచి 4 గంటల సమయం పడితే డ్రోన్స్ ద్వారా ఒక ఎకరాకి కేవలం పది నిమిషాల్లో పిచికారీ పూర్తి చేసే అవకాశం ఉంటుందన్నారు. డ్రోన్స్ కొనుగోలుకు బ్యాంకుల ద్వారా 80 శాతం వరకు రుణాలు అందజేస్తోందన్నారు. డ్రోన్స్ కొనుగోలు చేసిన గ్రూపుకు అవసరమైన శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. అదే విధంగా జిల్లాలో రైతు తలసరి ఆదాయాన్ని రూ.2.35 లక్షలకు పెంచేలా జిల్లాలో ఉన్న వనరులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. 2029 నాటికి ప్రతి రైతు తలసరి ఆదాయం మూడు లక్షల వరకు పెంచేలా కూడా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. జిల్లాలో 42 శాతం వ్యవసాయం మీదనే ఆధారపడి ఉందని, అందులో ఎక్కువ శాతం మహానంది మండలం నుండే స్థూల దేశీయోత్పత్తి అధికంగా పెరిగే అవకాశం ఉందన్నారు. మ హానంది మండలంలో రైతు తలసరి ఆదాయం రూ.3.60 లక్షల వరకు ఉందని ఆ దిశగా అన్ని మండలాలు అభివృద్ధి చెందాలన్నారు. పంటలకు మోతాదుకు మించి రసాయనాలు, అధిక శాతం నీరు పంటలకు ఇవ్వడం ద్వారా భూసాంద్రత, కార్బన్ కంటెంట్, సూక్ష్మ పోషకాలు తగ్గే అవకాశం ఉందన్నారు. పొలాల్లో ప్రకృతి సేంద్రీయ ఎరువుల వాడకం పెంచాలని కలెక్టర్ రైతులకు వివరించారు. అం తకుముందు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డ్రోన్స్ వినియోగంపై రైతులకు సంపూర్ణ అవగాహన కల్పించారు. ఈ కార్యక్ర మంలో జిల్లా ఉద్యాన అధికారి నాగ రాజు, ఐసిఏఆర్ శాస్త్రవేత్త డా. సూగన్న, కేవీకే శాస్త్రవేత్త రమణయ్య, ఆత్మ పీడి రత్నకుమార్, ఏడిఏ నం ద్యాల రాజశేఖర్, తాసిల్దార్, ఎంపీడీవో, సర్పంచ్, ఎమ్పీటిసి, జెడ్పీటిసి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## దత్తాత్రేయస్వామివారికి విశేషపూజలు



శ్రీశైలం మే 29 (శ్రీచక్ర):లోకకల్యాణంకోసం దేవస్థానం గురువారం నాడు ఆలయప్రాంగణంలోని త్రిఫలవృక్షం క్రింద నెలకొని ఉన్న శ్రీ దత్తాత్రేయస్వామివారికి విశేషపూజలను నిర్వహించింది.ప్రతి గురువారం దేవస్థానసేవగా (సర్కారీసేవగా) ఈ కైంకర్యం జరిపించబడుతోంది.ఈ పూజాకార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతిపూజను జరిపించబడింది. ఆ తరువాత దత్తాత్రేయస్వామి వారికి పంచామృతాభిషేకం, విశేషపూజలు నిర్వహించబడ్డాయి.లోకోద్ధర ణకోసమై బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ఒకే స్వరూపములో దత్తాత్రేయునిగా అవతరించారు.అందుకే త్రిమూర్తి స్వరూపునిగా దత్తాత్రేయుడు ప్రసిద్ధుడు.కాగా శ్రీశైలక్షేత్రానికి దత్తాత్రేయుల వారికి ఎంతో దగ్గర సంబంధం ఉంది.ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం క్రింద దత్తాత్రేయ ులవారు తపస్సు చేశారని ప్రతీతి. అందుకే ఈ వృక్షానికి దత్తాత్రేయ వృక్షమని పేరు.కాగా దత్తాత్రేయస్వామివారు కలియుగంలో గోదావరితీరాన పిఠాపురంలో శ్రీపాదవల్లభునిగా జన్మించారు. వీరు ఒకసారి శ్రీశైలక్షేత్రం లోనే చాతుర్మాస్య వ్రతాన్ని ఆచరించినట్లుగా గురుచరిత్రలో చెప్పబడింది. కాగా శ్రీపాదవల్లభుడు తమ శిష్యులకు ఆయా తీర్థక్షేత్రాల మహిమా విశేషాలను పేర్కొనే సందర్భంలో కూడా శ్రీశైలాన్ని పలుసార్లు ప్రస్తావిం చారు.శ్రీపాదవల్లభుల జన్మ తరువాత మహారాష్ట్రలోని కరంజినగరములో నృసింహసరస్వతి స్వామిగా దత్తాత్రేయస్వామివారు జన్మించారు. వీరు ఒకసారి మహాశివరాత్రి రోజున శ్రీశైలమల్లికార్జునుని సేవించినట్లుగా కూడా గురుచరిత్ర చెబుతోంది.నృసింహసరస్వతి వారు తమ అవతార సమాప్తిని శ్రీశైలంలోని పాతాళగంగలోనే చేశారు.కలియుగ ప్రభావం రోజు రోజుకు ఎక్కువకావడముతో, నృసింహసరస్వతీస్వామి అదృశ్య రూపములో ఉండి తన భక్తులను రక్షించాలని నిర్ణయించారు.దాంతో భౌతికదేహాన్ని త్యజించేందుకు నలుగురు శిష్యులతో కలిసి శ్రీశైలానికి వచ్చారు.శ్రీశైలం లోని కదళీవనం దగ్గర తమ శిష్యులు చూస్తుండగానే నృసింహసర స్వతిస్వామివారు అరటి ఆకులతో చేసిన ఒక ఆసనంపై కూర్చొని, కృష్ణానదిలో ప్రవేశించి, కొంతదూరం ఆ అరటిఆకులపైనే పయనిస్తూ, అదృశ్యమైనట్లు గురుచరిత్ర చెబుతోంది.

# కోట,వాకాడు ప్రభుత్వ పాఠశాలల్లో ఉర్దూ ఉపాధ్యాయ పోస్టుల పునరుద్ధరణ..,

**తిరుపతి డీఈఓ నుండి కోట,వాకాడు ఎంఈఓలకు ఉత్తర్వులు..,**
**గత ప్రభుత్వ విధానాల వల్ల 40 సంవత్సరాలనుండి నిర్ధిష్టంగా ఉన్న ఉర్దూ పోస్టుల రద్దు...,**
**విలీనం పేరిట 18 కిలోమీటర్ల దూరంలోని ఉన్నత పాఠశాలలకు తరలింపు..,**
**రాష్ట్ర విద్యాశాఖ మంత్రినారాలోకేష్, గూడూరు ఎమ్మెల్యే పాశింలకు పలుమార్లు వినతిపత్రాలు అందజేసిన జలీల్..,**
**అధిష్టానానికి, మైనారిటీ మంత్రి ఫరూక్ దృష్టికి సమస్యను తీసుకెళ్లిన జలీల్ అహ్మద్..,**
**ఫలించిన టీడీపీ మైనారిటీ నేత జలీల్ అహ్మద్ కృషి...,**
**ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ కు ప్రత్యేక కృతజ్ఞతలు : జలీల్ అహ్మద్...,**
**జలీల్ అహ్మద్ కృషి ని అభినందిస్తున్న మైనారిటీ కుటుంబాలు,ఉర్దూ ఉపాధ్యాయులు...,**







కోట మే 29 (శ్రీచక్ర) : కోట,వాకాడు మండలాల్లోని ప్రాథమిక పాఠశాలలో ఉర్దూ పోస్టులను పునరుద్దస్తున్నట్టు తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం నుండి ఆయా మండలాల శాఖ అధికారులకు ఉత్తర్వులు అందాయి.గత జగన్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా మండలాలను ప్రాతిపదికగా తీసుకొని 18 కిలోమీటర్ల పరిధిలోని పాఠశాలల్లో 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాల్లో విలీనం చేసిన క్రమంలో పలు పాఠశాలల్లో ఉర్దూ పోస్టులు రద్దు అయ్యాయి.దీంతో ఉర్దూ ఉపాధ్యాయులు దూరప్రాంతాలలో విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.ఈ సమస్యపై తెలుగుదేశంపార్టీ తిరుపతి పార్లమెంట్ మైనారిటీ అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్ ఉర్దూ ఉపాధ్యాయుల సమస్యపై, ఉర్దూ పోస్టు లేనందువల్ల మైనారిటీ విద్యార్థులు ఉర్దూ విద్యకు దూరమవడం వల్ల కలిగే నష్టాలను గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లారు .తిరుపతి జిల్లా కేంద్రంలో జరిగిన మైనారిటీ సదస్సుల్లో టీడీపీ జాతీయ కార్యదర్శి,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ లిఖిత పూర్వకంగా వినతిపత్రం అందజేసి వివరించారు. గూడూరు ఎమ్మెల్యే పాశిం ద్వారా మైనారిటీ మంత్రి ఫరూక్, అధిష్టానానికి తెలియజేసారు.ఈ క్రమంలో కడపలో జరుగుతున్న మహానాడు వేదికగా గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ దృష్టికి మరోసారి జలీల్ అహ్మద్ తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే, జిల్లా విద్యాశాఖ అధికారికి సమస్యని క్షుణ్ణంగా వివరించి కోట,వాకాడు మండలాల్లో ఉర్దూ పోస్టులను యుధావిధిగా పునరుద్దరణయ్యేలా ఆదేశాలు జారీ చేయించారు. జలీల్ అహ్మద్ ఆవిరళ కృషితో కోట,వాకాడు మండలాల్లో ఉర్దూ పోస్టుల నియామకం జరిగినందుకు గాను మైనారిటీ కుటుంబాలు ఆయనకు హర్షం వ్యక్తం చేస్తూ ధన్యవాదములు తెలుపుతున్నాయి. జలీల్ మాట్లాడుతూ గత ప్రభుత్వ విధానాల వల్ల 40 సంవత్సరాలనుండి నిర్ధిష్టంగా ఉన్న ఉర్దూ పోస్టు స్థానాలు చిన్నాభిన్నం అయ్యాయని అన్నారు.ఉర్దూ పోస్టుల పునరుద్దరణ ప్రక్రియ కార్యరూపం దాల్చినందుకు సంపూర్ణ సహాయ సహకారాలు అందించిన ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ కు జలీల్ అహ్మద్ ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# పశ్చిమగోదావరి జిల్లాలో యోగాంధ్రకు భారీ ప్రణాళిక అమలు ..

**ప్రతినిత్యం గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో కార్యక్రమాలు**
**జిల్లా కేంద్రంలో ప్రతిరోజు ఒక కార్యక్రమం.. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**







భీమవరం: మే 29, (శ్రీ చక్ర) ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా యోగాంధ్ర కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేసేందుకు భారీ ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. గురువారం పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం భీమవరం అల్లూరి సీతారామరాజు స్మృతివనం నందు ఏర్పాటుచేసిన యోగ శిక్షణా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి స్వయంగా పాల్గొని యోగాసనాలను అభ్యసించారు. గంటపాటు జరిగిన యోగ శిక్షణ కార్యక్రమంలో సుమారు రెండు వందల మంది పిల్లలు, పెద్దలు పాల్గొనగా, మాస్టర్ ట్రైనర్స్ ను అనుకరిస్తూ జిల్లా కలెక్టర్ కూడా అన్ని యోగాసనాలను కచ్చితత్వంతో చేసి చూపటం ఆశ్చర్యపరిచింది. శిక్షణ కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ గ్రామ, మండల, జిల్లా స్థాయిలో విస్తృత అవగాహనా కార్యక్రమాలను నిర్వహించడానికి ఆయా స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థలు ఇలా అన్ని వర్గాల ప్రజలను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేస్తున్నామని చెప్పారు. జిల్లా కేంద్రంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు స్మృతి వనం వద్ద యోగా స్ట్రీట్‌ను ఏర్పాటు చేసి, ప్రతిరోజూ ఒక కార్యక్రమం నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు. రోజుకో మండలం చొప్పున ఎంపిక చేసి ర్యాలీలు, అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. యోగా మంత్ కార్యక్రమంలో భాగంగా వందమంది మాస్టర్ ట్రైనర్లను ఎంపిక చేసి ఒక్కొక్కరు 50 మంది చొప్పున ట్రైనర్లను తీర్చిదిద్దేలా మూడు రోజులపాటు శిక్షణను పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. వీరు మండల, గ్రామ పరిధిలో శిక్షణ అందజేస్తారన్నారు. గుర్తించిన పర్యాటక ప్రదేశాలలో కనీసం 5,000 వేల మందితో యోగా ప్రదర్శనలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే మే 27న వశిష్ట గోదావరి తీరాన వలందర రేవు వద్ద భారీ ఎత్తున వినూత్న రీతిలో బోట్లు పైన యోగా ప్రదర్శన పూర్తి చేయడం జరిగిందన్నారు. జూన్ 3వ తేదీన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెనుగొండ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున యోగా నిర్వహణకు చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. జూన్ 09వ తేదీ మొగల్తూరు మండలం పేరుపాలెం బీచ్ లో, 16వ తేదీ భీమవరం అల్లూరి సీతారామ రాజు స్మృతి వనం వద్ద, 19వ తేదీ భీమవరం డియన్ఆర్ కాలేజీ, నరసాపురం వై యన్ యం కళాశాలలో 5 వేలు మందితో యోగాంధ్ర కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తామని ప్రజలందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. వివిధ స్థాయిల్లో యోగ పోటీలను గ్రామ, వార్డు స్థాయిలలో మే 26 నుండి ప్రారంభించడం జరిగిందని, మే 30 తో ఈ పోటీలు ముగుస్తాయన్నారు. అలాగే మండల స్థాయిలో జూన్ 2 నుండి జూన్ 7 వరకు, జిల్లా స్థాయిలో జూన్ 9 నుండి జూన్ 14 వరకు పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్తమ యోగా పాట, ఉత్తమ యోగా పెయింటింగ్, ఉత్తమ యోగా వ్యాసం, తదితర అంశాలలో విజేతలను ప్రకటించి జూన్ 17 మరియు 18న బహుమతులను అందజేయడం జరుగుతుందన్నారు. జూన్ 2న రంగోలి పోటీలను కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా భారీఎత్తున యోగా ప్రదర్శనా కార్యక్రమంకు సన్నాహక ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డీఈవో ఇ.నారాయణ, జిల్లా పర్యాటక శాఖ అధికారి ఏవి అప్పారావు, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ కీర్తి శ్రవణ్, ఆయుష్ శాఖ డాక్టర్ హరి శ్రీనివాస్, యోగా మాస్టర్ ట్రైనీలు యు. వెంకటేశ్వర రాజు, పి.భవాని, పి.రోహిణి, ఇశా ఫౌండేషన్ భీమవరం కోఆర్డినేటర్ డాక్టర్ డి.విజయ, ప్రముఖ సంఘ సేవకులు కంతేటి వెంకటరాజు, అల్లూరి సీతారామరాజు సేవ సమితి యోగ మాస్టర్ బి హెచ్ వి సత్యనారాయణ రాజు, స్థానిక ప్రజలు, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

# సహకార సంఘాలు సేవా సంఘాలు అయినా ఆదాయ పన్ను శాఖకు రిటన్లు దాఖలు తప్పనిసరి.

**ఆదాయపన్ను శాఖ జాయింటు కమిషనరు ప్రతాఫ్ సింగు భుక్య.**




ఏలూరు,మే 29( శ్రీ చక్ర), ఏలూరు డిసియంయస్ గ్రాండు కన్వెన్షన్ హాల్లో జిల్లా కో-ఆపరేటివ్ సొసైటీ సంఘాలకు ఆదాయపన్ను శాఖకు రిటన్లు దాఖలు తప్పని సరిపై,జిల్లా కోపరేటివ్ కార్యదర్శులు,పర్సన్ ఇన్చార్జిలతో ఒక్కరోజు అవగాహన సదస్సును ఆదాయపన్ను శాఖ జాయింటు కమిషనరు ప్రతాఫ్ సింగు భుక్య నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదాయపన్ను శాఖ జాయింటు కమిషనరు మాట్లాడుతూ సహకార సంఘాలు సేవా సంఘాలు అయినా ఆదాయ పన్ను శాఖకు క్రమం తప్పకుండా రిటన్లు దాఖలు చేసి సహకరించాలని అన్నారు. ఏలూరు జిల్లాలో 158 కో-పరేటివ్ సహకార సంఘాలలో 155 సంఘాలు పూర్తిస్థాయిలో కంప్యూటరీకరణ అగుట శుభపరిణామం అన్నారు. మిగతా మూడు కో-పరేటివ్ సహకార సంఘాలు కూడా కంప్యూటరీకరణ చెయ్యాలని సూచించారు.ఆదాయపన్ను శాఖ లాగిన్ ద్వారానే ఆదాయ పన్ను రిటన్లు దాఖలు చెయ్యాలని,మాన్యువల్ కు అవకాశం లేదని పాత పద్ధతులకు స్వస్తి చెప్పాలని స్పష్టం చేశారు.కో-పరేటివ్ సహకార సంఘాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలు పొందాలి అంటే ఆదాయపన్ను శాఖకు రిటన్లు దాఖలు చేసి ఏటువంటి పెండింగులు, బకాయిలు లేకుండా చూసుకోవాలని ఆయా కో-అపరేటివ్ సహకార సంఘాలుదే బాధ్యత అన్నారు.ఆదాయపన్ను శాఖ నియమనిబంధనలను వెబ్సైట్ ద్వారా తెలుసుకోవాలని,సహకార సంఘాలు మంచి ఆడిటరును నియమించుకోవాలని సూచించారు.ఆదాయపన్ను శాఖ నుండి నోటీసులు వస్తే వెనువెంటనే ఆడిటరును సంప్రదించాలని అశ్రద్ధ చేస్తే ఎన్నో ఇబ్బందులు కలుగు తాయని ఆదాయపన్ను శాఖ జాయింటు కమిషనరు ప్రతాఫ్ సింగు భుక్య అన్నారు.జిల్లా సహకార శాఖ అధికారి ఆరిమిల్లి శ్రీనివాసు మాట్లాడుతూ జిల్లాలో ప్రతి కో-అపరేటివ్ సహకార సంఘాలు ఆదాయపన్ను రిటన్లు దాఖలు చేయుటలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు.ఆడిటరు సంప్రదించి ఆదాయపన్ను శాఖ లాగిన్ ద్వారా రిటన్లు దాఖలు చెయ్యాలని,ఆదాయపన్ను నోటీసులు జారీ చేయకముందే రిటన్లు దాఖలుపై దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా సహకార శాఖ అధికారి ఆరిమిల్లి శ్రీనివాసు, ఏలూరు ఆదాయపన్ను శాఖ అధికారి షేక్ అబ్దుల్ ఖయాం, డివిజనల్ కో-ఆపరేటివ్ అధికారి పి.త్రినాథ్,ఆడిటరు ఆర్.రాధాకృష్ణ,జిల్లా కో-ఆపరేటివ్ సహకార సంఘాల కార్యదర్శులు,పర్సన్ ఇన్చార్జిలు,తదితరులు పాల్గొన్నారు .....



## మహానాడుకు బయలుదేరిన టిడిపి నాయకులు



కోట మే 29 (శ్రీచక్ర):తెలుగుదేశంపార్టీప్రతిష్టాత్మకంగాకడపలో నిర్వహిస్తున్న తెలుగుదేశం పార్టీ పండుగ మహానాడు కార్యక్రమంలో బాగంగా బహిరంగసభలోపాల్గొనడానికిగూడూరుశాసనసభ్యులు డాక్టర్ పాశిం.సునీల్ కుమార్ ఆదేశాల మేరకు మండల పార్టీ పెద్దలు డీసీసీబీ బ్యాంక్ మాజీ చైర్మన్,శ్రీశ్రీశ్రీ కోటమ్మ తల్లి దేవస్థానం చైర్మన్ నల్లపురెడ్డి జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలోసీనియర్ టిడిపి నాయకులు,కోట మండల అధ్యక్షులు మద్దాలి.సర్వోత్తమ రెడ్డి,జిల్లా బిసి సెల్ ప్రధాన కార్యదర్శి తీగల.సురేష్ బాబు నాయకత్వంలో కొత్తపట్నం,సిద్దవరం పంచాయతీ ఇల్లకూరు పాడు గ్రామం,కర్లపూడి, ఉత్తమనెల్లూరు గ్రామాల నుండి టీడీపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు,టీడీపీ అభిమానులు బయలుదేరారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షులు తిరుమూరు.మురళి,తిరుపతి పార్లమెంట్ ఎస్సి సెల్ ప్రధాన కార్యదర్శి ఇన్నమాల. అనొక్,తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు జరుగుమల్లి.కోటేశ్వరరావు సిద్దవరం పంచాయతీ నాయకులు,జనసేన నాయకులు కావాలి. అనొక్ లు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్ల తో సమీక్షా సమావేశం రేషన్ సరుకులు అందించే విధానంపై అవగాహన కల్పిస్తున్న తాహసిల్దార్ కే.జే జే రావు



కోట మే 29 (శ్రీ చక్ర) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము ప్రవేశపెట్టి నటువంటి పౌరసరఫరాల నిత్యవసర వస్తువులను పంపిణీ చేసే కార్యక్రమము పాత పద్ధతిలో మార్పు చేయడం జరిగిందని తహసీల్దార్ కే. జే జే రావు తెలిపారు.ఈ సందర్భంగా కోట మండలంలోని డీలర్లుతో ఎంపిడిఓ కాన్ఫరెన్స్ హాల్ నందు ఉన్నటువంటి అందరు డీలర్ల తో సమీక్షా సమావేశను నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో రాష్ట్రప్రభుత్వం నుండి విచ్చేసిన పలు సూచనలు తెలియజేయడం జరిగింది.అదేవిధంగా ప్రతి రేషన్ షాప్ ఉదయం 8 గంటలు నుండి మధ్యాహ్నం 12 గంటలు వరకు , సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రతి ఒక్కరు కూడా షాప్ ను నిర్వహించాలని,అదేవిధంగా ఎవరైతే కార్డుదారులు షాపుకి వస్తారో వారికి మంచినీటి సదుపాయంతో పాటు కూర్చోవడానికి వసతి కల్పించాలని తెలిపారు.తర్వాత రేషన్ షాపు డీలర్ షాపులో నందు ధరలు పట్టికను,షాపు పేరును,స్టాక్ రిజిస్టర్ ను డిస్ప్లేలో పెట్టవలసి ఉందని 65 సంవత్సరాలు పైబడి వారికి,వికలాంగులకు స్వయంగా డీలర్ సరుకులు ఇంటికి వెళ్లి ఇవ్వాలని అందరూ రేషన్ షాపు డీలర్లకు సూచనలు ఇవ్వడం జరిగింది.అయితే జూన్ 6 వ తేది నుండి ఈ కార్యక్రమం ప్రారంభం కానున్నట్లు తెలిపి,ప్రజలు దీనిని గమనించి సహకరించాలని తెలియజేశారు.మండలంలోని రేషన్ కార్డుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## నేడు పట్టణంలో విద్యుత్ కు అంతరాయం



రామచంద్రపురం, మే 29(శ్రీచక్ర) రామచంద్రపురం పట్టణంలో 30 వ తేది శుక్రవారం ఉదయం 08.00 నుండి మధ్యాహ్నం 1.గంట వరకు పలుచోట్ల విద్యుత్తు నిలుపుదల చేయనున్నట్లు ఎలక్ట్రికల్ ఏఇ రత్నాలరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు . ఈమేరకు గురువారం 33 /11 కేవి రామచంద్రపురం టౌన్ సెక్షన్లో 11కేవి రామచంద్రపురం టౌన్ -2 ఫీడర్ మీద ట్రీ ట్రిమ్మింగ్స్, మరియు మెయింటినెన్స్ వర్క్ చేయడం కొరకు చప్పిడివారు సావరం గిరిబాల హాస్పిటల్ ఆదర్శ హాస్పిటల్ బ్రాడీపేట ముచ్చిమిల్లి రోడ్డు రాము పుల్లర్తి యందు విద్యుత్ సరఫరా కు అంతరాయం కలుగునని రామచంద్రపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రత్నాల రావు తెలియజేసారు. విద్యుత్ వినియోగదారులు విషయం గ్రహించి సహకరించాలని ఆయన కోరారు.

# టీడీపీలో కోవర్టులు ఎవరు...

విజయవాడ, మే 29,టీడీపీ. అది కరుడుగట్టిన పసుపు కార్యకర్తల సమూహం. ఎన్టీఆర్ నుంచి ఇప్పుడు చంద్రబాబు, లోకేశ్ వరకు అందరి అభిమానులు, పార్టీ కార్యకర్తలు ఉంటారు. అదంతా కరుడు గట్టిన బ్యాచ్. పవర్‌లో ఉన్నా లేకున్నా పార్టీ కోసమే పని చేసే వాళ్లుంటారు. అలాంటప్పుడు టీడీపీలో కోవర్టులు ఎవరు అన్నది హాట్ టాపిక్ అవుతోంది. టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు చేసిన కామెంట్స్ పొలిటికల్ సెన్సేషన్ అవుతున్నాయి. టీడీపీలో వైసీపీ కోవర్టులు ఉన్నారన్న బాబు..తమతో ఉంటూ వాళ్ల శత్రువులను ఎలిమినేట్ చేస్తున్నారని ఫైరవుతున్నారు చంద్రబాబు. కోవర్టులను టీడీపీలోకి పంపి ఆ కోవర్టుల ద్వారా మీ ఎజెండా అమలు చేయాలనుకుంటే అది సాధ్యం కాదంటూ స్ట్రేయిట్ ఫార్మార్డ్‌గా వార్నింగ్ ఇచ్చారు.మహానాడు వేదికగా సీఎం చంద్రబాబు చేసిన సంచలన వ్యాఖ్యలపై అటు టీడీపీలో, ఇటు వైసీపీలో చర్చనీయాంశం అయ్యాయి. ఎవరైనా పదవి కోసం వస్తారు. ఆస్తులు కాపాడుకోవడం వస్తారు. అధికార పార్టీలో ఉండాలన్న ఆశతో జంపింగ్ చేస్తారు. కానీ పగ కోసం పార్టీ మారడం కొత్త ట్రెండా అన్న డిస్కస్ జరుగుతోంది. చంద్రబాబు చెప్పింది కాస్త పొలిటికల్ క్రైమ్ థ్రిల్లర్ మూవీలాగే అనిపించినా.. ఏపీలో ఇప్పుడేది సీన్ నడుస్తోందట. అందుకే కోవర్టుల విషయంలో సీఎం చంద్రబాబు చాలా సీరియస్‌గానే రియాక్ట్ అయ్యారని చర్చించుకుంటున్నారు తెలుగు తమ్ముళ్లు. రాష్ట్రంలో ఈ మధ్యకాలంలో జరిగిన కొన్ని ఘటనలే చంద్రబాబు వ్యాఖ్యలకు కారణమట.ఒంగోలు, మాచర్లలలో జరిగిన హత్యలు కోవర్టుల ప్రమేయంతో జరిగాయని భావిస్తోందట టీడీపీ హైకమాండ్. వైసీపీ కుట్ర రాజకీయాల్లో భాగంగా కోవర్టులను టీడీపీలోకి పంపిస్తుందని అనుమానమంటున్నారు. కొందరు వైసీపీ నేతలు ఆయా నియోజకవర్గాల్లో తమ ప్రత్యర్థులను టార్గెట్ చేసేందుకు.. ప్రభుత్వం మారగానే టీడీపీలోకి జంప్ అయ్యారని ఆలస్యంగా పసిగట్టారట. రాజకీయ రక్షణ కోసం టీడీపీలో చేరినట్లుగా నటిస్తూ పాతకక్షలు తీర్చుకోవడానికి..అధికార పార్టీగా ఉన్న టీడీపీని అస్త్రంగా వాడుకుంటున్నారనే సమాచారం చంద్రబాబుకు చేరిందంటున్నారు. పైగా టీడీపీ వర్గపోరుతో చంపుకుంటున్నారని వైసీపీ ప్రచారం చేస్తుండటం చంద్రబాబుకు ఆగ్రహం తెప్పించిందట.ఇంటర్నల్ రిపోర్ట్ ఆధారంగానే మహానాడు వేదికగా చంద్రబాబు అలా స్టేట్‌మెంట్ ఇచ్చారని..క్యాడర్‌ను కూడా అలర్ట్ చేశారని అంటున్నారు తెలుగు తమ్ముళ్లు. పల్నాడు జంట హత్యల ఘటన వెనుక వైసీపీ నేత పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రమేయం ఉందనేది టీడీపీ హైకమాండ్ అనుమానమట. పిన్నెల్లి మద్దతుతోనే గుండ్లపాడు హత్యలు జరిగాయని..అధికారం పోవడంతోనే పిన్నెల్లికి సన్నిహితంగా ఉన్న కొందరు వైసీపీని వీడుతున్నట్లు ప్రకటించి..టీడీపీలో చేరి తమ నేతలను హతమార్చారని మండిపడుతున్నారు తెలుగు తమ్ముళ్లుఅయితే పొద్దుతిరుగుడు పువ్వులతో జాగ్రత్తగా ఉండాలంటూ వైసీసీని వీడి కూటమి పార్టీల్లోకి వస్తున్న నేతల గురించి ఈ మధ్య మంత్రి పయ్యావుల కేశవ్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు పార్టీలో చర్చనీయాంశంగా మారాయి. రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో వైసీపీ నేతలకు పోలీసు అధికారులు సహకరిస్తున్నట్టు టీడీపీలో చర్చ జరుగుతోంది. పల్నాడు జిల్లా ఎస్పీ వ్యవహారశైలిపైనా టీడీపీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొందరు పోలీసు అధికారులు కోవర్టులకు సహకరిస్తున్నట్టు అనుమానిస్తున్నారు. ఫ్యాక్షన్ ప్రభావం ఉన్న నియోజకవర్గాల్లో కోవర్టు రాజకీయాలు ఎక్కువగా జరుగుతున్నట్టు టీడీపీ నేతలు చెబుతున్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పలు హత్య జరిగాయి. ఆ హత్యలు చేసుకుంది టీడీపీలోని రెండు వర్గాలేనని పోలీస్ అధికారులు ప్రెస్‌మీట్లు పెట్టి మరీ స్టేట్‌మెంట్లు ఇచ్చుకున్నారు. దీన్ని అస్త్రంగా మార్చుకుని..కూటమి ప్రభుత్వంలో లా ఆర్డర్ దెబ్బతిందని..టీడీపీ హత్యలను ప్రోత్సహిస్తుందని వాయిస్ రైజ్ చేస్తూ వచ్చింది వైసీపీ.అయితే హత్యల విషయంలో డిటేయిల్డ్ రిపోర్ట్ తెప్పిస్తే..హత్యకు పాల్పడ్డ వారంతా టీడీపీలో కొత్తగా చేరిన వారేనని గుర్తించారట. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిరాగానే.. టీడీపీ కండువా కప్పుకుని సేఫ్‌గా షెల్టర్ పొందడమే కాకుండా..టీడీపీలో ఉన్న తమ నేతలను వైసీపీ వలస నేతలు చంపారని ఆలస్యంగా గ్రహించారట. అందుకే చంద్రబాబు ఓపెన్ స్టేట్‌మెంట్ ఇచ్చారని..కోవర్టుల విషయంలో పార్టీలో ఇంటర్నల్‌గా పకడ్బందీ చర్యలు తీసుకునేందుకు మాస్టర్ ప్లాన్ రెడీ చేసిందట టీడీపీ హైకమాండ్.

# ఆపరేషన్ వైసీపీ స్టార్ట్...

విజయవాడ, మే 29, ఆపరేషన్ వైసీపీ.. అంటే.. వైసీపీని కాపాడుకునే ప్రయత్నం. ఆది నుంచి అన్ని విషయాల్లోనూ పార్టీని అన్ని విధాలా కాపాడుకునే ప్రయత్నం ప్రారంభమైందా? అంటే.. వైసీపీ వర్గాల నుంచి ఔననే సమాధానం వస్తోంది. మద్యం కుంభకోణం కేసు తీవ్రతరం కావడం.. ఇటీవల సీఎం చంద్రబాబు కూడా.. కేంద్రం చెవిలో వేయడం.. ముఖ్యంగాకేంద్ర హోం మంత్రి అమిత్ షా వంటివారు.. కూడా చంద్రబాబుకు ఈవిషయంలో గ్రీన్ సిగ్నల్ ఇచ్చారన్న చర్చ సాగుతుండడంతో జగన్ అలెర్టయ్యారన్న సంకేతాలు వస్తున్నాయి.ఒకవేళ ఆయన జైలుకు వెళ్లాల్సి వస్తే.. వెళ్లేందుకు సిద్ధమని ఆయనే స్వయంగా చెప్పారు. "రండి. విజ యవాడలోనే ఉన్నా.. జైలు కొత్తకాదు.. కేసులు కూడా కొత్తకాదు. రాజకీయాలలో ఉన్నప్పుడు వాటికి భయ పడతామా!" అని తేల్చి చెప్పారు. ఈ మాట ఆయన నోటి నుంచే వచ్చిందంటే.. 'విషయం' ఆయన వర కు చేరిందన్నది పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో గతంలో మాదిరిగా ఆయన జైలుకు వెళ్తే... పార్టీని కాపాడేందుకు ఎవరూ లేరు. అమ్మ, చెల్లి కూడా రివర్స్ అయ్యారు.ఈ క్రమంలోనే ముందుగానే పార్టీ విషయంపై అప్రమత్తంగా ఉన్నట్టు తెలుస్తోంది. అదే.. ఆపరేషన్ వైసీపీ అంటున్నారు. పార్టీ పగ్గాలను ఒక 'కీలక వ్యక్తి'కి అప్పగించడంతోపాటు.. పార్టీ తరఫున ప్రచారం చేసేందు కు.. ప్రజల్లోకి వెళ్లేందుకు కూడా.. ఒక 'టీం'ను కూడా జగన్ రెడీచేసుకున్నట్టు సమాచారం. అంతేకాదు.. ఇప్పటికే ఆయనకు దూరమైన ఐప్యాక్‌ను కూడా చేరువ చేసుకుంటున్నట్టు తెలిసింది. గతంలో కొందరు ఆయనకు దూరమైనా.. ఇప్పుడు చేరువ చేసుకునేందుకు జగన్ ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీని బలోపేతం చేసుకునే 'మంత్రదండం' సంక్షేమ, పథకాల తాలూకు ఎసెన్స్ తగ్గకుండా.. ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లేందుకు కూడా జగన్ రెడీ అయ్యారని సమాచా రం. ప్రస్తుతం ఆపరేషన్ వైసీపీపై గత రెండు రోజులుగా జగన్ అంతర్గతంగా చర్చించుకుంటున్నారని.. దీనిలో ఒకరిద్దరు ఢిల్లీకి చెందిన నాయకులు(ఓ కీలక పార్టీ అని ప్రచారం జరుగుతోంది.) కూడా ఉన్నార ని.. సమాచారం. అయితే.. అరెస్టు కాకుండా చర్యలు తీసుకునే ప్రయత్నం మంచిదని.. కొందరు చెబుతున్నారు. సో.. మొత్తానికి ఆపరేషన్ వైసీపీ అయితే.. స్టార్ట్ అయింది. ఇది ఎలాంటి మలుపు తీసుకుంటుంది. ఏమేరకు వైసీపీకి మేలు చేస్తుంది? అనేది చూడాలి.

# లోకేష్ టీమ్ లో అంతా యువతరమే

కడప, మే 29, నారా లోకేష్ కు పార్టీ పగ్గాలు అప్పగించాల్సిన సమయం ఇది అని సన్నిహితులు చెబుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో నారా లోకేష్ కు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా పదవి ఇస్తారని ప్రచారం జరుగుతోంది. అయితే లోకేష్ టీం లో ఎవరు అనేది ఇప్పుడు ప్రశ్న. చంద్రబాబు మాదిరిగానే నమ్మకస్తులైన బృందాన్ని లోకేష్ ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉంది. తెలుగుదేశం పార్టీలో లోకేష్ కు ప్రమోషన్ ఖాయమా? వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇస్తారా? టిడిపిలో సీనియర్లంతా ఇప్పుడు ముక్తకంఠంతో కోరుకుంటున్నది అదే. మహానాడు వేదికగా ప్రసంగిస్తున్న నేతలంతా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇదే మంచి సమయం అని చంద్రబాబుకు సూచిస్తున్నారు. తెలుగుదేశం పార్టీకి నాయకత్వ పరంగా ఎటువంటి లోటు లేదు. అపర చాణిక్యుడిగా పేరొందిన చంద్రబాబు ఉన్నారు. కానీ చంద్రబాబు వయసు 75 సంవత్సరాలు దృష్ట్యా.. నారా లోకేష్ కు పార్టీ పగ్గాలు అప్పగించాల్సిన సమయం ఇది అని సన్నిహితులు చెబుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో నారా లోకేష్ కు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా పదవి ఇస్తారని ప్రచారం జరుగుతోంది. అయితే లోకేష్ టీం లో ఎవరు అనేది ఇప్పుడు ప్రశ్న. చంద్రబాబు మాదిరిగానే నమ్మకస్తులైన బృందాన్ని లోకేష్ ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉంది.వాస్తవానికి టిడిపి ఆవిర్భావ సమయంలో పార్టీలో చంద్రబాబు లేరు. 1983 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన చంద్రబాబు టిడిపి అభ్యర్థి చేతిలో ఓడిపోయారు. అక్కడకు కొద్ది రోజులకే తెలుగుదేశం పార్టీలో చేరారు. 1985 మధ్యంతర ఎన్నికల్లో టిడిపి తరఫున చంద్రబాబు పోటీ చేయలేదు. కానీ పార్టీలో చేరిన నాటి నుంచి తనదైన ముద్ర వేసుకున్నారు. పార్టీ వ్యవహారాలను చూసుకున్నారు. అదే చంద్రబాబు రాజకీయానికి ప్లస్ గా మారింది. చంద్రబాబు టీం లోకి పూసపాటి అశోక్ గజపతిరాజు, అయ్యన్నపాత్రుడు, కళా వెంకట్రావు, కింజరాపు ఎర్రం నాయుడు, యనమల రామకృష్ణుడు, కేఈ కృష్ణమూర్తి, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, నిమ్మకాయల చినరాజప్ప.. ఇలాంటి నేతలంతా చంద్రబాబు సన్నిహితులుగా ముద్రపడ్డారు. చంద్రబాబుతో పార్టీ వీరు రాజకీయంగా ఎదిగారు. చంద్రబాబు ముఖ్యమంత్రి



అయిన ప్రతిసారి వీరికి ప్రాధాన్యత దక్కుతూనే ఉంది. మీరు కూడా చంద్రబాబు నాయకత్వాన్ని మరింత పెంచుకునేలా చేశారు.అయితే ఇప్పుడు లోకేష్ అటువంటి టీం ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉంది. మరో నాలుగు దశాబ్దాల పాటు టిడిపి ఉనికి చాటుకునేలా ప్రణాళికలు వేస్తున్నారు. అందులో భాగంగానే నారా లోకేష్ కు నాయకత్వ బాధ్యతలు అప్పగించాలన్న డిమాండ్ తెరపైకి వచ్చింది. అయితే చంద్రబాబుకు మాదిరిగా లోకేష్ కు సైతం వలయంగా ఉండే నాయకత్వం ఇప్పుడు అవసరం. ఇప్పటికే లోకేష్ టీం పటిష్ట దిశగా ఉంది. మొన్నటి ఎన్నికల్లో ఆ టీం పనిచేసింది. ఆ టీం కు చెందిన కొంతమంది ఎన్నికల్లో పోటీ చేసి చట్టసభలకు ఎన్నికయ్యారు కూడా. అయితే చంద్రబాబు సన్నిహిత నేతల వారసులు కూడా.. లోకేష్ టీంలో ఉండడం విశేషం.వాస్తవానికి శ్రీకాకుళం నుంచి చిత్తూరు జిల్లా వరకు తెలుగుదేశం పార్టీకి పటిష్ట నాయకత్వం ఉంది. అయితే రాష్ట్రస్థాయిలో పార్టీని నడపడం, సంక్షోభాలను ఎదుర్కోవడం, చిక్కుముడులను తప్పించడం, కార్యకర్తలకు మార్గదర్శక నిలవడం, అధినేతకు నమ్మకస్తులుగా ఉండేవారే ఈ టీంలో తప్పకుండా ఉంటారు. అయితే అలాంటివారు ఎవరు అన్నది ఇప్పుడు ప్రధానంగా చర్చ జరుగుతోంది. శ్రీకాకుళం నుంచి కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, గౌతు శిరీష, విజయనగరం నుంచి సుజయకృష్ణ రంగారావు, అదితి గజపతిరాజు? విశాఖ జిల్లా నుంచి గంటా శ్రీనివాస్, చింతకాయల విజయ్, వంగలపూడి అనిత? గోదావరి జిల్లాల నుంచి జ్యోతుల నవీన్, సానా సతీష్, పుట్ట మహేష్ కుమార్ యాదవ్.. కృష్ణాజిల్లా నుంచి దేవినేని ఉమామహేశ్వరరావు, బుద్ధ వెంకన్న పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. గుంటూరు జిల్లా నుంచి కోడెల శివరాం, కోవెలమూడి రవీంద్ర, పెమ్మసాని చంద్రశేఖర్, లావు శ్రీకృష్ణదేవరాయలు.. ప్రకాశం జిల్లా నుంచి దామచర్ల సత్య.. నెల్లూరు జిల్లా నుంచి కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి.. రాయలసీమ జిల్లాల నుంచి బైరెడ్డి శబరి, రెడ్డప్ప గారి మాధవి రెడ్డి, పరిటాల శ్రీరామ్, జెసి పవన్ రెడ్డి, అస్మిత్ రెడ్డి వంటి వారు లోకేష్ టీం అని ప్రచారం జరుగుతోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

## బ్రహ్మంగారిమఠం మండలం నుండి భారీగా తరలి వెళ్లిన టిడిపి శ్రేణులు

**ప్రతి గ్రామము నుండి మహానాడుకు వెళ్ళిన ప్రజలు ,కార్యకర్తలు**

బ్రహ్మంగారిమఠం,మహానాడులో భాగంగా కడపలో మూడో రోజు జరుగుతున్న భారీ బహిరంగ సభకు బ్రహ్మంగారి మఠం మండలం లోని అన్ని గ్రామాల నుండి తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు ప్రజలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు ఈ మహానాడు కార్యక్రమానికి మైదుకూరు నియోజకవర్గం శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ ఇచ్చిన పిలుపునందుకొని బ్రహ్మంగారిమఠం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి తెలుగుదేశం పార్టీ నాయకులు ముడుమాల పోల్ రెడ్డి ఎస్ ఆర్ శ్రీనివాసులురెడ్డి మల్లికార్జునరెడ్డి సాంబశివారెడ్డి పూజా శివ యాదవ్ సుధాకర్ యాదవ్ తదితర నాయకుల ఆధ్వర్యంలో గ్రామ గ్రామము నుండి తెదేపానేతలుబహిరంగసభకు తరలి వెళ్లారు ఉదయం 8 గంటలకే మండల ంలోని అన్ని గ్రామాలకు తెదేపా నేతలు బస్సులను బస్సులలో బయలుదేరి తరలి వెళ్లారు వారితోపాటు పచ్చ జెండాలు బ్యానర్లు పెద్ద ఎత్తున ప్రదర్శన చేసుకుంటూ తరలి వెళ్లారు మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు ఎవరికి వారు తమ అధినేత పుట్టా సుధాకర్ యాదవ్ ఇచ్చిన పిలుపునకు స్పందించి వేలాదిమంది కార్యకర్తలను తరలించడంలో సఫలీకృతులయ్యారని చెప్పొచ్చు మండలంలో కందిమల్లాయపల్లె కొత్తూరు నరసన్న పల్లె సోమిరెడ్డి పల్లె గంగిరెడ్డిపల్లి మల్లేపల్లి చెంచయ్య గారి పల్లె ముడమల పంచాయతీ పలువురాలపల్లె పంచాయతీ ఇలా మండలంలోని 11 పంచాయతీలలోని అఅన్ని గ్రామాల నుంచి తెదేపా అభిమానులు కార్యకర్తలు ప్రజలు నందమూరి అభిమానులు కడపకు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు

## తూర్పు నుంచే ప్రారంభమైన సినిమా వివాదం

కాకినాడ, మే 29, (న్యూస్ పల్స్)జూన్ 1వ తేదీ నుంచి సినిమా థియేటర్ల బంద్‌కు ఎగ్జిబిటర్స్ అండ్ డిస్ట్రిబ్యూటర్స్‌లోని ఓ వర్గం పిలుపునిచ్చింది. దీనిని తెలుగు ఫిల్మ్ చాంబర్ ఖండించింది. థియేటర్ల బంద్‌కు ఎలాంటి అవకాశం లేదని ప్రకటించడం జరిగింది. ఈ క్రమంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ఈ విషయం చేరింది. జూన్ 12వ తేదీన 'హర హర వీర మల్లు' సినిమా రిలీజ్‌కు ముందు ఇలాంటి ప్రకటనలు రావడం, దానిపై ఏపీ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్ పోలీసు విచారణకు ఆదేశించడంతో ఇది సంచలనంగా మారింది. ఆ నలుగురు ఇండస్ట్రీ వ్యక్తుల వల్లే ఇదంతా అన్న చర్చ తీవ్రంగా సాగింది. దీనిపై దిల్ రాజు, అల్లు అరవింద్ వంటి సినిమా ప్రముఖులు మాట్లాడారు. అయితే, దీనిపై దిల్ రాజు మాట్లాడుతూ ఈ బంద్‌తో తమకు సంబంధం లేదని, తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఓ జనసేన పార్టీ నేతే కారణమని ప్రెస్‌మీట్‌లో ప్రకటించడం మరింత సంచలనంగా మారింది.జనసేన పార్టీ నుంచి సస్పెన్షన్‌కు గురైన అత్తి సత్యనారాయణ ఎగ్జిబిటర్ కమ్ డిస్ట్రిబ్యూటర్. 'అను శ్రీ ఫిల్మ్స్' పేరుతో సినిమా డిస్ట్రిబ్యూటర్‌గా అత్తి సత్యనారాయణకు పేరుంది. అంతేకాకుండా, తెలుగు సినీ చాంబర్ ఆఫ్ కామర్స్‌లో కార్యవర్గ సభ్యుడిగా ఉన్నారు. తూర్పు గోదావరి జిల్లా డిస్ట్రిబ్యూటర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కూడాను. రాజమండ్రిలో జేకే క్లాసిక్‌లో జరిగిన సమావేశంలో ఆయన సినిమా బంద్ పిలుపునకు భాగస్వామి అయ్యారన్న వార్తలు బయటకు వచ్చాయి.సినిమా థియేటర్ల బంద్ పిలుపు అనేది ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్ల మధ్య జరిగిన చర్చలు విఫలం కావడం వల్ల వచ్చింది. ఈ పిలుపు వెనుక అత్తి సత్యనారాయణ ఉండటం వల్ల తూర్పుగోదావరి జిల్లా పేరును దిల్ రాజు ప్రస్తావించారు. అయితే, ఉభయ గోదావరి జిల్లా విషయానికి వస్తే, ఇక్కడ పెద్ద సంఖ్యలో సింగిల్ స్క్రీన్ థియేటర్లు ఉన్నాయి. ఏపీలో దాదాపు వెయ్యి సింగిల్ స్క్రీన్ థియేటర్లు, మల్టీప్లెక్స్‌లు ఉంటే, అందులో ఉభయ గోదావరి జిల్లాల్లో 50 నుంచి 60 వరకు థియేటర్లు ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఈ సింగిల్ స్క్రీన్ థియేటర్లు ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. టికెట్ల ధరల నియంత్రణ, థియేటర్ల అద్దె విధానం కాకుండా రెవెన్యూ షేరింగ్ విధానం అమలు చేయాలని, కొత్త సినిమాలను ఓటీటీలలో కొంత ఆలస్యంగా విడుదల చేయాలని లేకపోతే థియేటర్ల మనుగడ ప్రశ్నార్థకమని ఇక్కడి ఎగ్జిబిటర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో తూర్పుగోదావరి జిల్లా నుంచి ఈ డిమాండ్ మొదలై సినిమా హాళ్ల బంద్ వరకు వెళ్లింది. సినిమా రంగానికి సంబంధించి కూడా ఉభయ గోదావరి జిల్లాల ప్రాముఖ్యత అంతా ఇంతా కాదు. అలా థియేటర్ల బంద్ సమస్య రెండు తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశమైంది.

# బెజవాడ నుంచి లూప్ లైన్ లోకి ట్రైన్లు

విజయవాడ, మే 29,భారతదేశంలోని అతిపెద్ద రైల్వే జంక్షన్ లలో ఒకటి. హౌరా- చెన్నై, న్యూ ఢిల్లీ -చెన్నై, విజయవాడ -నిడదవోలు (లూప్ ) వంటి కీలక మైన రైల్వే లైను ఈ స్టేషన్ గుండా వెళ్తాయి. 10 ప్లాట్ ఫామ్ లు,24 ట్రాకులు తో రద్దీగా ఉండే ఈ రైల్వే స్టేషన్ నుండి ప్రారంభమయ్యే రైళ్లన్నీ ఇతర స్టేషనులకు తరలి వెళ్ళిపోతున్నాయి. ప్రస్తుతం కేవలం 6 ఎక్స్ప్రెస్ రైళ్లు మాత్రమే విజయవాడ నుంచి (అంటే ఆరిజన్ స్టేషన్ విజయవాడ గా) నడుస్తున్నాయి. ప్రస్తుతం విజయవాడ స్టేషన్ నుంచి బయలుదేరే ఎక్స్ప్రెస్ రైళ్లు 6 మాత్రమే ఉన్నాయి. అవి 3 సిస్టర్స్ గా పిలుచుకునే1) ట్రైన్ నెంబర్ 12713- విజయవాడ- కాచిగూడ- శాతవాహన ఎక్స్ ప్రెస్2) ట్రైన్ నెంబర్ 12711- విజయవాడ- చెన్నై - పినాకిని ఎక్స్ ప్రెస్3) ట్రైన్ నెంబర్ 12718- విజయవాడ- విశాఖపట్నం- రత్నాచల్ ఎక్స్ ప్రెస్ఈ మూడు సూపర్ ఫాస్ట్ రైళ్లను త్రీ సిస్టర్స్ గా పిలుస్తారు. ఈ మూడూ ఉదయం 6 గంటల ప్రాంతంలో విజయవాడ స్టేషన్ నుండి బయలుదేరి మళ్లీ సాయంత్రానికి విజయవాడ చేరుకుంటాయి.అవి ట్రైన్ నెంబర్ 12707/12708 చెన్నై- విజయవాడ- చెన్నై జన శతాబ్ది ఎక్స్ప్రెస్. ఇది మంగళవారం మినహా మిగిలిన 6 రోజులూ ప్రయాణిస్తుంది. విజయువాడలో మధ్యాహ్నం 3:30 గంటలకు ఈ ట్రైన్ బయలుదేరుతుంది.2) 12743/12744- గూడూరు- విజయవాడ- గూడూరు- విక్రమసింహపురి అమరావతి ఎక్స్ ప్రెస్. ఈ ట్రైన్ ప్రతిరోజు విజయవాడలో 6 గంటలకు బయలుదేరుతుంది. 3) 12796/12795 లింగంపల్లి- విజయవాడ- లింగంపల్లి ఎంప్లాయిస్ స్పెషల్. ఈరైలు ప్రతిరోజు సాయంత్రం 5:30 కి విజయవాడలో బయలుదేరి లింగంపల్లి వెళుతుంది.ఓవరాల్ గా విజయవాడకు ప్రస్తుతం మిగిలిన ఆరు ఇంటర్సిటీ రైళ్లు ఇవి మాత్రమే. ఇంతకుముందు విజయవాడ నుంచి బయలుదేరి వెళ్లే ధర్మవరం రైళ్లను ఇప్పుడు మచిలీపట్నం నుంచి ఒకటి, నరసాపురం మరొకటి గా మార్చేశారు. అలాగే విజయవాడ హౌరా మధ్య తిరిగే హమ్ సఫర్ ఎక్స్ ప్రెస్ ను తిరుపతి కి తీసుకుపోయారు. ఉత్తరాంధ్ర ప్రజలకు అందుబాటులో ఉండే ముఖ్యమైన విజయవాడ రాయగడ ప్యాసింజర్ ను ఎక్స్ప్రెస్ గా ప్రమోట్ చేసి దానిని గుంటూరు రాయగడగా మార్చేశారు. ప్రస్తుతం విజయవాడ నుంచి చెన్నై వెళుతున్న వందేభారత్ ను కూడా నరసాపురం నుంచి నడిపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి అన్న ప్రచారం బలంగా వినిపిస్తోంది. అదే కనుక జరిగితే అతి ముఖ్యమైన విజయవాడ రైల్వే స్టేషన్ ఆరిజన్ స్టేషన్గా ఉండే ఆరు ఇంటర్సిటీ ఎక్స్ప్రెస్ లు కొన్ని ప్యాసింజర్ రైళ్లు మాత్రమే మిగులుతాయి.విజయవాడ స్టేషన్ కి అతి ముఖ్యమైన సమస్య స్థలం లేకపోవడం. ఎప్పుడో 1888లో కట్టిన ఈ రైల్వే స్టేషన్ కు గతంలో ఏడు ప్లాట్ ఫామ్ లు ఉండేవి. ప్రస్తుతం వన్ టౌన్ సైడు మరో మూడు ప్లాట్ ఫామ్ లు పెంచి మొత్తానికి 10 చేశారు. ప్రస్తుతం ఈ స్టేషన్ ఔూఉ 1 క్యాటగిరి లో ఉంది. అంటే కనీసం లక్ష మంది ప్రయాణికులు రోజు ఈ స్టేషన్ నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. 190 ట్రైన్స్,170 గూడ్స్ రైళ్లు విజయవాడ స్టేషన్ మీదుగా ప్రతిరోజు ప్రయాణిస్తుంటాయి. దానితో స్టేషన్ నుండి కొత్తగా బయలుదేరే రైళ్లను వేయలేకపోతోంది రైల్వే శాఖ. హాలో కొత్తగా వేసే రైళ్లకి ఇక్కడ ప్లేస్ ఉండటం లేదు. ఏదన్నా కొత్త రైలు విజయవాడ నుంచి బయలుదేరేలా దానిని ప్లాట్ ఫామ్ పై ఎక్కువసేపు నిలిపి ఉంచాలి. దానివల్ల వేరే రైళ్లకు అడ్డంకిగా మారుతుంది. అందుకే ప్రస్తుతం కొత్త రైళ్లను విజయవాడ నుంచి బయలుదేరేలా వేయడం లేదు. పోనీ ప్లాట్ఫామ్ లు పెంచుదామా అంటే విజయవాడ రైల్వే స్టేషన్ సరిగ్గా నగరం నడిబొడ్డున ఉంది. అక్కడ కొత్తగా ప్లాట్ ఫామ్ లు కట్టే అవకాశం లేదు. ప్రస్తుతం ఈ సమస్యకు విజయవాడకి చుట్టుపక్కల శాటిలైట్ స్టేషన్లు కట్టడం ఒక్కటే మార్గంగా కనిపిస్తోంది రైల్వే శాఖకు. అందుకే విజయవాడ నిడదవోలు మార్గంలో రామవరప్పాడు, విజయవాడ హౌరా మార్గంలో గుణదల, విజయవాడ న్యూఢిల్లీ మార్గంలో రాయనపాడు స్టేషన్లను సాటిలైట్ స్టేషన్లుగా ఆధునికంగా మార్చుతున్నారు. మరొక మూడు నాలుగు నెలల్లో ఇవి రెడీ అయిపోతే చాలా ట్రైన్లను విజయవాడ మెయిన్ స్టేషన్కు రాకుండా డైవర్ట్ చేయొచ్చు. అప్పుడు విజయవాడ నుంచి బయలుదేరి వెళ్లేలా సరికొత్త రైళ్లను కేటాయించే అవకాశం కేంద్రానికి ఉంటుంది. అందుకే రైల్వే డిపార్ట్మెంట్ ఈ సాటిలైట్ స్టేషన్ల నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది.



# స్పోర్ట్స్ న్యూస్

## పదకొండేళ్ల తర్వాత ప్లేఆఫ్ చేరిన పంజాబ్ కింగ్స్.. ఆ జట్టు రికార్డులు ఎలా ఉన్నాయంటే..?

ఐపీఎల్‌లో భాగంగా రాయల్ చాలెంజర్ బెంగళూరుతో పంజాబ్ కింగ్స్ తలపడనున్నది. చండీగఢ్‌లోని ముల్లాపూర్‌లో నేడు జరిగే ఈ క్వాలిఫయర్-1 మ్యాచ్‌లో విజయం సాధించాలని పంజాబ్ కింగ్స్ జట్టు ఉత్సాహంతో ఉన్నది. ఈ సారి కెప్టెన్‌గా శ్రేయాస్ అయ్యర్, హెడ్‌కోచ్ రికీ పాంటింగ్ బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. ఇద్దరి నేతృత్వంలో జట్టు సీజన్‌లో ఎవరూ ఊహించని విధంగా అద్భుతంగా రాణించి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచి ప్లేఆఫ్స్‌కు చేరింది. పంజాబ్ కింగ్స్ దాదాపు 11 సంవత్సరాల తర్వాత ప్లేఆఫ్‌కు చేరుకుంది. క్వాలిఫయర్-1 మ్యాచ్‌లో గెలిచి నేరుగా ఫైనల్‌కు చేరుకోవాలన్న కసితో ఉన్నది. ఐపీఎల్‌లో ప్లేఆఫ్స్‌లో పంజాబ్ రికార్డులు ఎలా ఉన్నాయో చూద్దాం.పంజాబ్ క్వాలిఫయర్-1లో ఒక్కసారే ఆడింది. ఆడిన ఒకే ఒక మ్యాచ్‌లో ఓడిపోయింది. 2014లో జార్జ్ బెయిలీ నాయకత్వంలో పంజాబ్ జట్టు క్వాలిఫయర్-1లో కోల్‌కతా నైట్ రైడర్స్‌తో తలపడి.. పరాజయం పాలైంది. ఆ తర్వాత పంజాబ్ జట్టు క్వాలిఫయర్-2 గెలిచి.. ఫైనల్స్‌కు చేరినా.. కప్పు తృటిలో చేజారింది. పంజాబ్ ప్లేఆఫ్స్‌లో ఇప్పటి వరకు మూడు మ్యాచ్‌లు ఆడింది. ఇందులో ఆ జట్టు ఒకసారి మాత్రమే గెలవగలిగింది. మూడింటిలో ఓటమిని చవిచూసింది. 2008, 2014లో జరిగిన ఎలిమినేటర్‌లో పంజాబ్‌ను చెన్నై సూపర్ కింగ్స్ తొమ్మిది వికెట్ల తేడాతో ఓడించింది. తాజాగా పంజాబ్ కింగ్స్ అగ్రస్థానంలో నిలిచి ప్లేఆఫ్స్‌కు చేరుకుంది. గత సీజన్‌లో కోల్‌కతాకు టైటిల్‌ను సాధించిన అయ్యర్.. ఈ సారి సైతం టైటిల్‌ను సాధించాలని ఉవ్విళ్లూరుతున్నాడు.



ప్లేఆఫ్స్‌లో పంజాబ్ తరపున వృద్ధిమాన్ సాహా అత్యధిక పరుగులు చేశాడు. మూడు ఇన్నింగ్స్‌లలో 156 పరుగులు చేశాడు. ఆ తర్వాత వీరేంద్ర సెహ్వాగ్ 131 పరుగులతో రెండోస్థానంలో నిలిచాడు. మనన్ వోహ్రా 127 పరుగులతో మూడోస్థానంలో కొనసాగుతున్నాడు. ప్లేఆఫ్స్‌లో పంజాబ్ తరఫున కరణ్‌వీర్ సింగ్ అత్యధిక వికెట్లు పడగొట్టాడు. మూడు ఇన్నింగ్స్‌లలో ఏడు వికెట్లు పడగొట్టాడు. మిచెల్ జాన్సన్ ఐదు వికెట్లతో రెండవ స్థానంలో, అక్షర్ పటేల్ మూడు వికెట్లతో మూడవ స్థానంలో ఉన్నాడు.శ్రేయాస్ అయ్యర్ (కెప్టెన్), నేహల్ వధేరా, హర్నూర్ సింగ్, ముషీర్ ఖాన్, పీ అవినాష్, ప్రభ్‌సిమ్రాన్ సింగ్, విష్ణు వినోద్, జోష్ ఇంగ్లిస్, మార్కస్ స్టోయినిస్, ప్రవీణ్ దూబే, ప్రియాంష్ ఆర్య, అజ్మతుల్లా ఒమర్జాయ్, ఆరోన్ హార్డీ, మార్కో జాన్సెన్, హర్‌ప్రీత్ బ్రార్, సూర్యాంష్ షెడ్గే, శశాంక్ సింగ్, యుజ్వేంద్ర చాహల్, అర్ష్‌దీప్ సింగ్, జేవియర్ బార్ట్‌లెట్, కుల్దీప్ సేన్, విజయ్‌కుమార్ విశాక్, యష్ ఠాకూర్, మిచెల్ ఓవెన్, కైల్ జామిసన్.


## ఐపీఎల్ క్వాలిఫయర్ మ్యాచ్‌కు ముల్లాన్‌పూర్ సిద్ధం.. నేటి మ్యాచ్‌కు భారీ భద్రత కల్పించిన పంజాబ్ పోలీసులు..

ఐపీఎల్ 2025 సీజన్ ముగింపు దశకు చేరుకుంది. లీగ్ దశ ముగియగా.. గురువారం నుంచి ప్లేఆఫ్ మ్యాచులు మొదలుకానున్నాయి. ఐపీఎల్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన పంజాబ్ కింగ్స్-రాయల్స్ చాలెంజర్స్ బెంగళూరు మధ్య క్వాలిఫయర్-1 మ్యాచ్ జరుగనున్నది. ఈ మ్యాచ్‌కు పంజాబ్‌లోని ముల్లాన్‌పూర్ సిద్ధమైంది. ఈ స్టేడియంలో క్వాలిఫయర్-1 మ్యాచ్‌తో పాటు ఎలిమినేటర్ మ్యాచ్ జరుగనుండగా.. పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్-పాకిస్తాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఐపీఎల్ క్వాలిఫయర్-1, ఎలిమినేటర్ మ్యాచులకు భద్రతా ఏర్పాట్లు భారీగా చేశామని.. మ్యాచ్‌కు ఎలాంటి ఆటంకాలు ఉండవని పంజాబ్ పోలీసులు పేర్కొన్నారు.సవరించిన షెడ్యూల్ ప్రకారం.. క్వాలిఫయర్-1 మ్యాచ్ గురువారం జరుగనుండగా.. ఆ తర్వాత ఎలిమినేటర్ మ్యాచ్ జరుగుతుంది. క్వాలిఫయర్-2 మ్యాచ్‌తో పాటు ఫైనల్ మ్యాచ్ అహ్మదాబాద్ వేదికగా జరుగనున్నది. నేటి మ్యాచ్‌కు పంజాబ్ పోలీసులు 65 మంది పోలీసు అధికారులు, 2500 మందికిపైగా భద్రతా బలగాలను మోహరించింది. పంజాబ్ స్పెషల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (లా అండ్ ఆర్డర్) అర్పితా శుక్లా మాట్లాడుతూ ముల్లాన్‌పూర్ స్టేడియంలో రెండు కీలక మ్యాచులు జరుగుతాయని తెలిపారు. ఈ మ్యాచులకు దేశవ్యాప్తంగా క్రికెట్ అభిమానులు వచ్చే అవకాశం ఉందన్నారు. మ్యాచ్‌కు స్టేడియం లోపల, చుట్టూ విస్తృతమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. 65 మంది పోలీసు అధికారులు, 2500 మందికిపైగా జవాన్లను మోహరించినట్లు తెలిపారు. అభిమానులకు ఇబ్బంది కలుగకుండా చూస్తామన్నారు. అదే సమయంలో భద్రతా చర్యలు కఠినంగా ఉంటామన్నారు. మ్యాచ్‌కు ముందు మాక్ డ్రిల్ సైతం నిర్వహించినట్లు చెప్పారు.ఏప్రిల్ 22న పహల్గామ్ ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు చనిపోయిన విషయం తెలిసిందే. దీనికి ప్రతీకారంగా భారత సైన్యం ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాక్‌లోని తొమ్మిది ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసింది. ఆ తర్వాత భారత్-పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. దాంతో ఐపీఎల్‌ను వారం పాటు బీసీసీఐ నిలిపివేసింది. ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడంతో ఐపీఎల్ షెడ్యూల్‌ని మార్చింది. వాస్తవానికి క్వాలిఫయర్-1, ఎలిమినేటర్ మ్యాచులు హైదరాబాద్‌లో.. క్వాలిఫయర్-2, ఫైనల్ మ్యాచ్ కోల్‌కతాలో జరగాల్సి ఉంది. అయితే, షెడ్యూల్ మార్పు తర్వాత క్వాలిఫయర్-1, ఎలిమినేటర్ మ్యాచ్‌ను ముల్లాన్‌పూర్, క్వాలిఫయర్-2తో పాటు ఫైనల్‌ను గుజరాత్‌లోని అహ్మదాబాద్ నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా మారుస్తూ నిర్ణయం తీసుకుంది.




## చరిత్రకు అడుగు దూరంలో విరాట్ కోహ్లీ

ఐపీఎల్ 2025లో విరాట్ కోహ్లీ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు చాలా బాగా రాణిస్తోంది. విరాట్ కోహ్లీ జట్టుకు కెప్టెన్ కాకపోయినా జట్టు బాధ్యత ఇప్పటికీ ఆయన భుజాలపైనే ఉంది. విరాట్ కోహ్లీ కూడా ఈ బాధ్యతను చాలా బాగా నిర్వర్తిస్తున్నాడు. ఈ సీజన్‌లో కోహ్లీ మంచి దూకుడుతో బ్యాటింగ్ చేస్తున్నాడు. విరాట్ కోహ్లీ బ్యాటింగ్ చూస్తుంటే చాలా త్వరగా టీ20 ఇంటర్నేషనల్ నుంచి రిటైర్ అయినట్లు అనిపిస్తుంది. ఇంతలో విరాట్ గొప్ప రికార్డుకు చాలా దగ్గరగా వచ్చాడు. కోహ్లీ వెస్టిండీస్ దిగ్గజం కీరన్ పొలార్డ్, పాకిస్తాన్ జట్టుకు చెందిన షోయబ్ మాలిక్ రికార్డులను అధిగమించే అవకాశం ఉంది. ఇంతకు ఆ రికార్డు ఏమిటి, విరాట్ కోహ్లీ ఆ రికార్డులను బ్రేక్ చేయడానికి ఎన్ని పరుగులుఅవసరమో తెలుసుకుందాం.టీమిండియా, ఆర్సీబీ రన్ మెషీన్ విరాట్ కోహ్లీ టీ20 క్రికెట్‌లో గొప్ప బ్యాటర్లలో ఒకడు. విరాట్ కోహ్లీ టీ20 క్రికెట్‌లో 412 మ్యాచ్‌లు ఆడాడు. ఈ కాలంలో విరాట్ కోహ్లీ 42.01 సగటు, 134.75 స్ట్రైక్ రేట్‌తో 13488 పరుగులు చేశాడు. అత్యధిక టీ20 పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో విరాట్ కోహ్లీ 5వ స్థానంలో ఉన్నాడు. అదే సమయంలో వెస్టిండీస్‌కు చెందిన కీరన్ పొలార్డ్ 13537 పరుగులతో నాల్గవ స్థానంలో, పాకిస్థాన్ జట్టుకు చెందిన షోయబ్ మాలిక్ 13571 పరుగులతో ఈ జాబితాలో మూడో స్థానంలో ఉన్నాడు. విరాట్ కోహ్లీ ఇంకా ఐపీఎల్‌లో మూడు మ్యాచ్‌లు ఆడగలడు. ఈ జాబితాలో ఈ ఇద్దరు బ్యాటర్లను విరాట్ కోహ్లీ సులభంగా అధిగమించగలడు.కీరన్ పొలార్డ్‌ను అధిగమించడానికి విరాట్ కోహ్లీకి 50 పరుగులు, షోయబ్ మాలిక్‌ను అధిగమించడానికి 84 పరుగులు అవసరం. విరాట్ కోహ్లీ ప్రస్తుత ఫామ్‌ను చూస్తే ఈ లక్ష్యం విరాట్ కోహ్లీకి చాలా సులభం అనిపిస్తుంది. విరాట్ కోహ్లీ మే 29న పంజాబ్ కింగ్స్ జట్టుతో జరిగే ఐపీఎల్ మొదటి క్వాలిఫయర్ మ్యాచ్‌లో ఆడతాడు. ఈ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ మంచి ఇన్నింగ్స్ ఆడితే వారిద్దరినీ అధిగమించే అవకాశం ఉంది. ఇప్పటివరకు ఏ భారతీయుడు ఈ స్థానాన్ని సాధించలేకపోయాడు. విరాట్ కోహ్లీ అలా చేసిన మొదటి భారతీయుడు అవుతాడు.పంజాబ్ కింగ్స్ జట్టుపై విరాట్ కోహ్లీ మరో 30 పరుగులు చేస్తే ఆ జట్టుపై అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా రికార్డులకెక్కుతాడు. ఇప్పటివరకు పంజాబ్ కింగ్స్ జట్టుపై విరాట్ కోహ్లీ 1104 పరుగులు చేశాడు. ప్రస్తుతం ఈ రికార్డు ఆస్ట్రేలియా దిగ్గజం డేవిడ్ వార్నర్ పేరిట ఉంది. డేవిడ్ వార్నర్ పంజాబ్ కింగ్స్ జట్టుపై 1134 పరుగులు చేశాడు. ఒక ఐపీఎల్ సీజన్‌లో అత్యధిక హాఫ్ సెంచరీలు నమోదు చేసిన డేవిడ్ వార్నర్ రికార్డును సమం చేసేందుకు విరాట్ కోహ్లీ అడుగుదూరంలో నిలిచాడు. ఈ మ్యాచ్ లో విరాట్ కోహ్లీ అర్థ శతకం సాధిస్తే డేవిడ్ వార్నర్ సరసన చేరుతాడు. విరాట్ కోహ్లీ ఈ ఐపీఎల్ సీజన్లో ఇప్పటివరకు 8 హాఫ్ సెంచరీలు చేశాడు. 2016 ఐపీఎల్ సీజన్లో డేవిడ్ వార్నర్ 9 ఫిఫ్టీలు సాధించాడు.విరాట్ కోహ్లీ ఐపీఎల్ 2025లో 13 ఇన్నింగ్స్‌లలో 60.20 సగటు, 147.91 స్ట్రైక్ రేట్‌తో మొత్తం 602 పరుగులు చేశాడు. ఈ సారి ఆర్సీబీ విజయంలో విరాట్ కోహ్లీ చాలా కీలక పాత్ర పోషించాడు. ఈ క్రమంలో విరాట్ కోహ్లీ ఫైనల్ వరకు ఈ ఫామ్‌ను కొనసాగించాలనుకుంటున్నాడు. ఐపీఎల్ 2025లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో విరాట్ కోహ్లీ ప్రస్తుతం 5వ స్థానంలో ఉన్నాడు. విరాట్ కోహ్లీ ఆరెంజ్ క్యాప్ గెలుచుకునే రేసులో కూడా ఉన్నాడు.




## క్రికెట్ పిచ్‌పైనే ఫైటింగ్.. బంగ్లా బ్యాటర్‌పై సౌతాఫ్రికా బౌలర్ అటాక్..



ఢాకా: బంగ్లాదేశ్, దక్షిణాఫ్రికా ఎమర్జింగ్ జట్ల మధ్య జరుగుతున్న క్రికెట్ మ్యాచ్‌లో ప్లేయర్లు ఘర్షణపడ్డారు. ఢాకాలో రెండు జట్ల మధ్య నాలుగు రోజుల మ్యాచ్ జరుగుతున్న సమయంలో.. మైదానంలోనే ఇద్దరు ప్లేయర్లు గొడవకు దిగారు. బంగ్లా బ్యాటర్ రిపన్ మోండల్‌పై .. సౌతాఫ్రికా పేస్ బౌలర్ షిపో నులి చేయిచేసుకున్నాడు. పిచ్‌పై వాగ్వాదానికి దిగారు. బంగ్లా బ్యాటర్‌కు సఫారీ బౌలర్ పంచ్ ఇచ్చాడు. ఫీల్డ్ అంపైర్‌తో పాటు మిగితా ఆటగాళ్లు అడ్డుకునే ప్రయత్నం చేశారు. బంగ్లా బ్యాటర్‌పై మరో దక్షిణాఫ్రికా ఫీల్డర్ దూసుకెళ్లే ప్రయత్నం చేశాడు. ప్రస్తుతం ఆటగాళ్లపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. మ్యాచ్ అధికారులు త్వరలో రిపోర్టును సమర్పించనున్నారు.ఓ క్రికెట్ వెబ్‌సైట్ ప్రకారం.. నులి బౌలింగ్‌లో స్ట్రెయిట్ సిక్సర్ కొట్టాడు రిపన్. దీంతో ఆ ఇద్దరు ఒకరిపై ఒకరు చూపులు విసురుకున్నారు. ఆ తర్వాత బ్యాటింగ్ పార్ట్నర్, నాన్ స్ట్రయికర్ వద్దకు బ్యాటర్ వెళ్లాడు. ఆ సమయంలో బంగ్లా బ్యాటర్ మీదకు సౌతాఫ్రికా బౌలర్ దూసుకువచ్చాడు. ఏదో మాటలు అనుకుని, ఒకర్ని ఒకరు తోసేసుకున్నారు. ఆ తర్వాత ఆ గొడవ పెద్దగా మారింది.

## దిగ్వేష్ నోట్‌బుక్ సెలబ్రేషన్ వెనుక ఇంత కథ ఉందా..!



ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో ఈసారి లక్నో సూపర్ జెయింట్స్ జట్టు అంత ప్రభావం చూపించలేకపోయింది. భారీ అంచనాలతో లీగ్ ప్రారంభించిన లక్నో 14 మ్యాచుల్లో 6 మ్యాచుల్లో విజయం సాధించింది. దీంతో ఫ్యాన్స్ తీవ్రంగా నిరాశ చెందారు. అయితే లక్నో జట్టులోని స్పిన్నర్ దిగ్వేష్ రాఠీ మాత్రం చర్చల్లో నిలిచాడు. అందుకు కారణం అతను చేసే సెలబ్రేషనే. ప్రతీసారి వికెట్ తీసినప్పుడల్లా నోట్‌బుక్‌లో రాస్తున్నట్లు సెలబ్రేట్ చేసుకోవడం అతనికి అలవాటు. అయితే చాలా సందర్భాల్లో అతను శృతి మించి సెలబ్రేట్ చేసుకోవడంతో అతనిపై పలు మార్లు జరిమానా కట్టాడు. అయినా అతని తీరు మారలేదు.సన్‌రైజర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అభిషేక్ శర్మ వికెట్ తీసిన అతను ఇంకాస్త శృతి మించడంతో అభిషేక్‌తో గొడవ జరిగింది. ఈ కారణంగా దిగ్వేష్‌పై ఒక మ్యాచ్ నిషేధం విధించారు. అయితే ఈ నోట్‌బుక్ సెలబ్రేషన్ వెనుక కారణాన్ని దిగ్వేష్ ఓ అభిమానికి వెల్లడించాడు. "ఎప్పుడు టోర్నీ జరిగినా.. నోట్‌బుక్ తీసుకెళ్తా. అందులో అందరి పేర్లు రాసుకుంటా" అని దిగ్వేశ్ సమాధానమిచ్చాడు. అయితే మ్యాచ్‌కి ముందు ప్రత్యర్థి ఆటగాళ్ల పేర్లు బుక్‌లో రాసుకొని.. తన బౌలింగ్‌లో ఔటైన ఆటగాడి పేరును కొట్టేస్తాడు. దీంతో ఫలానా ఆటగాడిని ఔట్ చేశానని రికార్డు చేసుకోవడమే దిగ్వేష్ నోట్‌బుక్ సెలబ్రేషన్ ఉద్దేశమని తెలుస్తోంది.

## టెస్ట్ కెప్టెన్సీ.. మనసులోని మాటను బయటపెట్టిన జడేజా

ఐపీఎల్ 2025 తర్వాత టీమిండియా జూన్‌లో ఇంగ్లాండ్‌లో పర్యటించనుంది. ఈ పర్యటనలో భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య 5 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ జరగనుంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి దిగ్గజ ఆటగాళ్లు టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్ అయినందున రవీంద్ర జడేజా ఇప్పుడు సీనియర్ ఆటగాడిగా ఈ పర్యటనలో ఉండబోతున్నాడు. ఐపీఎల్ 2025లో రవీంద్ర జడేజా ప్రదర్శన అంతగా ఏమీ లేదు. కానీ టెస్ట్ క్రికెట్‌లో రవీంద్ర జడేజా గణాంకాలు చాలా బాగున్నాయి. కాబట్టి ఇంగ్లాండ్ పర్యటనలో రవీంద్ర జడేజా నుంచి జట్టు ఎక్కువగా ఆశిస్తుంది. ఈ పర్యటనలో టీమిండియా కెప్టెన్సీ శుభ్‌మన్ గిల్‌కు అప్పగించిన సంగతి తెలిసిందే. అదే సమయంలో రవీంద్ర జడేజా టెస్ట్ ఫార్మాట్‌లో కెప్టెన్సీ గురించి భారత మాజీ లెజెండ్ ఆర్.అశ్విన్‌తో పేర్కొన్నారు.భారత జట్టుకు కెప్టెన్సీ చేయాలని మీరు ఎప్పుడైనా ఆలోచించారా అని అశ్విన్ తన యూట్యూబ్ ఛానెల్‌లో రవీంద్ర జడేజాను అడిగాడు. దానికి జడేజా సమాధానమిస్తూ.."అవును ఖచ్చితంగా.. నేనే కొన్నేళ్లుగా వేర్వేరు కెప్టెన్ల కింద ఆడాను. నేను ఆడిన ప్రతి కెప్టెన్ మనస్తత్వం నాకు తెలుసు. ప్రతి కెప్టెన్ జట్టును ఎలా నడపాలనుకుంటున్నాడనే దాని గురించి తన సొంత మనస్తత్వాన్ని కలిగి ఉంటాడు. ఉదాహరణకు ఎంఎస్ ధోని కెప్టెన్సీలో ప్రతి ఫార్మాట్‌లో ఆడాను. ఎంఎస్ ధోని ఆలోచన చాలా సులభం. ఒక బ్యాటర్ ఒక వైపు హిట్ కొట్టగలడని ధోని భావిస్తే అక్కడ ఒక ఫీల్డర్ ను ఉంచుతాడు. " అని రవీంద్ర జడేజా పేర్కొన్నారు.రవీంద్ర జడేజా టీ20 ఫార్మాట్ కెప్టెన్సీ గురించి మాట్లాడుతూ.. "టెస్ట్ క్రికెట్ కంటే టీ20 క్రికెట్‌లో కెప్టెన్సీ చాలా బిజీగా ఉంటుంది. టెస్ట్ క్రికెట్‌లో బౌలర్ అవసరానికి అనుగుణంగా మీరు ఇద్దరు లేదా ముగ్గురు ఫీల్డర్లను మార్చాలి. టెస్ట్ క్రికెట్‌లో కెప్టెన్సీ భిన్నంగా ఉంటుంది. ఇది చాలా సులభం కానీ లెక్కల ఆధారంగా ఉంటుంది. టెస్ట్ క్రికెట్‌లో ఐపీఎల్ లాగా సంక్లిష్టంగా ఉండదు. టెస్ట్ క్రికెట్ అంత బిజీగా ఉండదు." అంటూ రవీంద్ర జడేజా అన్నాడు.టీమిండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనితో తొలి సమావేశం గురించి రవీంద్ర జడేజా మాట్లాడుతూ.. "నేను మొదటిసారి చెన్నైలో 2005 ఛాలెంజర్స్ ట్రోఫీ సమయంలో ఎంఎస్ ధోనిని కలిశాను. నేను ముంబై నుంచి వస్తున్నాను. ఆయన కూడా అదే విమానంలో వస్తున్నారు. నేను ఎకానమీ క్లాస్‌లో కూర్చున్నాను. ఆయన బిజినెస్ క్లాస్‌లో కూర్చున్నారు. ధోని ముందు కూర్చున్నాడని అందరూ అంటున్నారు. కానీ నేను ఆయనను కలవడానికి సంకోచించాను." అని జడేజా చెప్పుకొచ్చాడు.




# తరచూ జుట్టుకు రంగు వేస్తున్నారా? ఎంత డెంజరో తెలుసా?



జుట్టుకు రంగు వేయడం చాలా మందికి ఫ్యాషన్ , స్టైల్ స్టేట్‌మెంట్‌గా మారింది. తెల్లటి వెంట్రుకలను దాచడం, రూపాన్ని మార్చుకోవడం వంటి కారణాలతో చాలామంది జుట్టుకు రంగు వేస్తుంటారు. అయితే, తరచుగా జుట్టుకు రంగు వేయడం వల్ల కొందరు అనుకోని ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటారు. జుట్టు రంగులు మామూలుగా రసాయనాలతో తయారు చేయబడి ఉంటాయి, ఇవి జుట్టు సహజ ఆరోగ్యాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉంది. ఈ అందం కోసం మనం చెల్లించే మూల్యం ఏమిటి? జుట్టుకు రంగు వేయడం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి తెలుసుకోవడం చాలా ముఖ్యం. జుట్టుకు రంగు వల్ల కలిగే దుష్ప్రభావాలు: హెయిర్ డైస్‌లో ఉండే రసాయనాలు జుట్టును పొడిగా చేస్తాయి. ఫలితంగా జుట్టు చిట్లిపోతాయి. కొంతమందికి హెయిర్ డైస్ వల్ల తల చుండ్రు సమస్య తీవ్రమవుతుంది. ఇది తలలో దురద, వాపు వంటి ఇతర సమస్యలకు కూడా దారితీస్తుంది. హెయిర్ డైస్‌లో ఉండే పారా-ఫెనిలీన్‌డైయామైన్‌అనే రసాయనం కొంతమందికి అలర్జీని కలిగిస్తుంది. ఇది చర్మం ఎర్రబడటం, వాపు, దురద, కళ్ళు నీరు కారడం వంటి లక్షణాలకు దారితీస్తుంది. తీవ్రమైన సందర్భాల్లో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కూడా కలగవచ్చు. "డబ్బు ఖర్చు లేకుండా.. ఇలా బరువు తగ్గండి.. లైట్ గా ఫీలవ్వండి!" రంగులలో ఉన్న హార్ష్ కెమికల్స్ జుట్టు ఫాలికల్స్‌ను బలహీనపరుస్తాయి. ఇది జుట్టు ఊడిపోవడానికి కారణం అవుతుంది. ప్రత్యేకంగా, సెన్సిటివ్ స్కాల్ప్ ఉన్నవారు మరింత ఇబ్బంది పడే అవకాశం ఉంది. సూర్యకాంతి, క్లోరిన్ వంటి వాతావరణ కారకాలు హెయిర్ డై కలిగిన జుట్టు రంగును మార్చవచ్చు. కొన్ని అధ్యయనాల ప్రకారం, తరచుగా హెయిర్ డైస్ వాడడం వల్ల కొన్ని రకాల క్యాన్సర్‌ల ముప్పు పెరుగుతుందని తెలుస్తోంది. అయితే, ఈ విషయంలో మరింత పరిశోధన అవసరం. తలకు రంగు వేసేటప్పుడు చర్మంపై రసాయనాలు తగిలే అవకాశం ఉంటుంది. ఇది చర్మ క్యాన్సర్‌కు కారణం కావచ్చు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు హెయిర్ డై వాడే ముందు చిన్న భాగంలో ప్యాచ్ టెస్ట్ చేయడం చాలా ముఖ్యం. కొత్త బ్రాండ్‌లను వాడే ముందు వాటి గురించి సరిగ్గా తెలుసుకోవాలి. రసాయనాలు తక్కువగా ఉండే సహజ రంగులను ఎంచుకోవడం మంచిది. జుట్టుకు సంబంధించిన సమస్యలకు వృత్తిపరమైన సలహా తీసుకోవడం మంచిది. హెయిర్ డైస్‌లో ఉండే రసాయనాలు గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులు, పిల్లలకు హానికరం. కనుక వారు జుట్టుకు రంగు వేయడం వంటి వాటికి దూరంగా ఉంటే మంచిది. హెయిర్ డైస్‌ను వాడే ముందు తలను బాగా కడగాలి. కళ్ళకు తగలకుండా జాగ్రత్త పడాలి. హెయిర్ డైస్‌ను వాడిన తర్వాత తలను బాగా శుభ్రం చేసుకోవాలి. ఒటలవతీబితిబవఎవనిబి జుట్టుకు రంగు వేయడం వల్ల కలిగే దుష్ప్రభావాలు గురించి తెలుసుకున్న తర్వాత, మీరు జాగ్రత్తగా నిర్ణయం తీసుకోవచ్చు. అందం కోసం ఆరోగ్యాన్ని ప్రమాదంలో పడేయవద్దు. సహజమైన అందాన్ని కాపాడుకోవడానికి ప్రయత్నించండి.

## బీట్ రూట్ తెగ తింటున్నారా? అయితే జాగ్రత్త!



ఆరోగ్యమే మహాభాగ్యం అంటారు. అటువంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసం చాలామంది ప్రధానంగా ఆహారం పైన దృష్టి సారిస్తున్నారు. మన శరీరానికి ఆరోగ్యాన్ని ఇచ్చే ఆహారాలని తీసుకోవడానికి చూస్తున్నారు. ఇక అలా మన శరీరానికి ఆరోగ్యాన్ని ఇచ్చే ఆహారాలలో బీట్ రూట్ ఒకటి. బీట్ రూట్ తో ఆరోగ్యం చాలా వంది శరీరంలో రక్తం వృద్ధి చేసుకోవడం కోసం ఐరన్ లోపాన్ని తగ్గించుకోవడం కోసం బీట్ రూట్ ను తింటూ ఉంటారు. బీట్ రూట్ శరీరంలోని రక్తహీనతను తగ్గించడానికి ఎంతో బాగా పనిచేస్తుంది. అంతేకాదు మన చర్మ ఆరోగ్యానికి కూడా బీట్ రూట్ బాగా ఉపయోగపడుతుంది. బీట్ రూట్ జ్యూస్ తాగితే చర్మం కాంతివంతంగా మారడమే కాకుండా ఆరోగ్యంగా కూడా ఉంటుంది. "శబరిమలకు వెళ్ళే అయ్యప్ప భక్తులు తప్పక తెలుసుకోవాల్సినవి ఇవే!" బీట్ రూట్ తిన్నా, జ్యూస్ తాగినా జాగ్రత్త అయితే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని బీట్ రూట్ ను అతిగా తింటే మాత్రం అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. బీట్ రూట్ లో ఎక్కువ నైట్రేట్ ఉంటుంది. దీనిని ఎక్కువగా తీసుకుంటే మన జీర్ణ వ్యవస్థ దెబ్బతింటుంది. బీట్ రూట్ జ్యూస్ ను పదే పదే తాగితే కడుపులో నొప్పి వచ్చి ఇబ్బంది పడతారు. ఈ సమస్యలు ఉన్న వారు బీట్ రూట్ తినొద్దు కనుక బీట్ రూట్ జ్యూస్ తాగే విషయంలో పరిమితంగా తీసుకోవడం అవసరం. ఇక బీట్ రూట్ అలర్జీ సమస్యలు ఉన్నవారు తినకుండా ఉంటేనే మంచిది. అలర్జీ సమస్యలతో బాధపడేవారు బీట్ రూట్ తింటే ఆ సమస్య మరింత పెరుగుతుంది. చర్మంపై దురద, దద్దుర్లు, గొంతు సమస్య, వాపు వంటి లక్షణాలు వచ్చి ఇబ్బంది పడతారు. అందుకే అలర్జీతో బాధపడేవారు బీట్ రూట్ తినకుండా ఉంటేనే మంచిది. ఖనీలివతీవట ఃఎ డయాబెటిస్, కాలేయ సమస్యలు ఉంటె బీట్ రూట్ తినొద్దు ఇక కాలేయం సమస్యతో బాధపడే వారు కూడా బీట్ రూట్ ఎక్కువ తినకూడదు. కాలేయం సమస్యతో బాధపడేవారు బీట్ రూట్ తింటే అందులో ఎక్కువగా ఉండే కాపర్, ఐరన్ కారణంగా కాలేయ సమస్యలు మరింత పెరుగుతాయి. ఇక షుగర్ అధికంగా ఉన్నవారు కూడా బీట్ రూట్ తినకూడదు. "వారానికి ఎంత బీరు తాగితే ఆరోగ్యానికి సురక్షితం?" ఈ అనారోగ్య సమస్య ఉన్నవారిపైనా ప్రతికూల ప్రభావం మీరు బీట్ రూట్ ఎక్కువగా తింటే నరాలు దెబ్బ తినే ప్రమాదం ఉంటుంది. కిడ్నీ సమస్యలతో బాధపడేవారు బీట్ రూట్ తినకుండా ఉంటేనే మంచిది. కిడ్నీలో రాళ్లు ఉన్న వారిపైన బీట్ రూట్ ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తుంది. కనుక మీరు బీట్ రూట్ తినడం మంచిది కాదు.

## రోజు ఇడ్లీ తింటున్నారా..?

ఇడ్లీ అంటే తెలుగు వారికి అతి ప్రియమైన ఆహారం. మెత్తటి, తెల్లటి, రుచికరమైన ఈ ఇడ్లీలు ఉదయం భోజనానికి అద్భుతమైన ఎంపిక. ఇవి ఆరోగ్యకరమైనవి కూడా. ఇడ్లీలను పెరుగు, చట్నీ, సాంబార్‌తో తింటే మరింత రుచిగా ఉంటుంది. ఇడ్లీ, ఆరోగ్యకరమైన భారతీయ అల్పాహారం. ఇది చాలా మంది ఇష్టపడే ఆహారం. ఇడ్లీలు దక్షిణ భారతదేశంలో ఉద్భవించాయి. వీటిని తమిళుడు, కన్నడిగు, తెలుగు వారు తమ సంప్రదాయ ఆహారంగా తింటారు. కానీ ప్రతిరోజు ఇడ్లీ తినడం వల్ల కలిగే లాభాలు, నష్టాలు ఏమిటో తెలుసుకోవాలి. ఇడ్లీ తినడం వల్ల కలిగే లాభాలు ఇడ్లీ పులియబెట్టి తయారు చేయబడుతుంది కాబట్టి, జీర్ణమవడానికి చాలా సులభంగా ఉంటుంది. ఇది జీర్ణ సమస్యలు ఉన్నవారికి చాలా మంచిది. ఇడ్లీలో కేలరీలు తక్కువగా ఉంటాయి మరియు ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది బరువు తగ్గాలనుకునే వారికి మంచి ఎంపిక. ఇడ్లీలో కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉంటాయి కాబట్టి, శరీరానికి శక్తిని అందిస్తాయి. ఇడ్లీలో కొవ్వు తక్కువగా ఉంటుంది కాబట్టి, గుండె ఆరోగ్యానికి మంచిది. ఇడ్లీలో ప్రోటీన్లు, విటమిన్లు మరియు ఖనిజాలు కూడా ఉంటాయి. "ఉదయాన్నే మొలకలు తింటే ఏం జరుగుతుందో తెలుసా..?" ఇడ్లీ తినడం వల్ల కలిగే నష్టాలు ప్రతిరోజు ఒకే రకమైన ఆహారం తినడం వల్ల, శరీరానికి అవసరమైన అన్ని రకాల పోషకాలు అందకపోవచ్చు. ఇడ్లీలో కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉంటాయి కాబట్టి, అధికంగా తీసుకుంటే బరువు పెరగడానికి దారితీస్తుంది. ఇడ్లీలో గ్లైసెమిక్



ఇండెక్స్ ఎక్కువగా ఉంటుంది కాబట్టి, రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడానికి దారితీస్తుంది. అధికంగా పులియబెట్టిన ఇడ్లీని తింటే, అజీర్తి మరియు గ్యాస్ వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ముగింపు ప్రతిరోజు ఇడ్లీ తినడం వల్ల కలిగే లాభాలు మరియు నష్టాలను పరిగణనలోకి తీసుకుని, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పాటించాలి. ఇడ్లీతో పాటు, ఇతర ఆహార పదార్థాలను కూడా తీసుకోవడం మంచిది. ఒక ఆరోగ్య నిపుణుని సలహా తీసుకోవడం మరింత మంచిది.


## రోజూ చపాతీ తింటే వచ్చే ఆరోగ్య సమస్యలు ఇవే.. జాగ్రత్త మరి..!!

చపాతీ లేదా రొట్టెలు చాలా మంది ఆహారపట్టికలో ప్రధాన పాత్ర పోషిస్తాయి. సాధారణంగా వీటిని ఆరోగ్యకరమైన ఆహారంగా భావిస్తారు, అయితే రోజూ అవి అధికంగా తీసుకోవడం వల్ల కొన్ని ఆరోగ్య సమస్యలు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయి. సమతుల్య ఆహారం తీసుకోవడం , అన్ని రకాల ఆహారాలను మితంగా తీసుకోవడం చాలా ముఖ్యం. 1. జీర్ణ సమస్యలు చపాతీల్లో అధికంగా ఉండే గ్లూటెన్ కొంతమందికి జీర్ణ సమస్యలను కలిగించవచ్చు. గ్లూటెన్ సెన్సిటివిటీ ఉన్నవారికి గ్యాస్, పొట్ట నొప్పి, నానిపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయి. ఎక్కువగా గోధుమ పిండితో తయారుచేసిన రొట్టెలు తింటే ఫైబర్ పరిమిత మోతాదును మించి అందుకోవడం వల్ల కొన్నిసార్లు మలబద్ధకం లేదా విరేచనాల సమస్యల్ని తెచ్చిపెట్టవచ్చు. "చలికాలంలో శరీర వెచ్చదనాన్ని పెంచే సూపర్ ఫుడ్స్ " 2. బరువు పెరుగుదల గోధుమ పిండిలో కార్బోహైడ్రేట్లు అధికంగా ఉంటాయి. రోజూ ఎక్కువ చపాతీలు తీసుకోవడం శరీరంలో అదనపు క్యాలరీలు చేరడానికి దారితీస్తుంది. రాత్రి సమయంలో చపాతీలను అధికంగా తింటే శరీరంలో ఎనర్జీ ఖర్చు కాకుండా కొవ్వుగా నిల్వ ఉంటుందనే ఆందోళన ఉంటుంది. 3. బ్లడ్ షుగర్ స్థాయి పెరుగుదల చపాతీల్లో గ్లైసెమిక్ ఇండెక్స్ మధ్యస్థరంగా ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర శాతం నెమ్మదిగా పెంచుతుందని భావించినా, అధికంగా తీసుకుంటే షుగర్ స్థాయిలపై ప్రభావం పడుతుంది. ముఖ్యంగా డయాబెటిస్ ఉన్నవారు చపాతీలను పరిమిత మోతాదులో మాత్రమే తీసుకోవాలి. 4. పోషకాల్లో అసమతౌల్యం రోజూ చపాతీలను మాత్రమే తీసుకుంటే, ప్రోటీన్, విటమిన్లు, మెగ్నీషియం, జింక్ వంటి పోషకాలు తగిన మోతాదులో లభించవు. ఇది ఆరోగ్యంపై దీర్ఘకాలిక ప్రభావం చూపుతుంది. సగటు ఆహారంలో ప్రోటీన్, మంచి కొవ్వులు, విటమిన్లు, మినరల్స్ అన్నీ సమపాళ్లలో ఉండాలి. "టీ తాగేటప్పుడు ఈ ఆహారాలు ఎట్టి పరిస్థితుల్లో తినొద్దు.. తిన్నారో?" 5. గ్యాస్ట్రిక్ సమస్యలు కొంతమందికి గోధుమ పిండిలో ఉండే పదార్థాలు ఆమ్లపిత్తం ఉత్పత్తిని ప్రేరేపిస్తాయి, ఇది గ్యాస్ట్రిక్ సమస్యలకు కారణమవుతుంది. దీనికి తోడు పచ్చడి లేదా కూరలో అధిక మసాలాలు ఉంటే సమస్య మరింత పెరుగుతుంది. 6. చర్మ సమస్యలు అధికంగా గ్లూటెన్ లేదా శుద్ధి చేయని గోధుమ పిండిని తీసుకోవడం వల్ల కొందరికి అలర్జీ వంటి సమస్యలు తలెత్తుతాయి. ఇది చర్మం మీద దద్దుర్లు లేదా చర్మంపై ముడతలు వచ్చే ప్రమాదం కలిగిస్తుంది. మొత్తంగా చూస్తే రోజూ చపాతీలు తినడం ఆరోగ్యకరమే అయినా, వాటి మోతాదును నియంత్రించుకోవడం ముఖ్యం. దానితోపాటు, వివిధ పోషక పదార్థాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం శరీరానికి అవసరమైన సమతౌల్యాన్ని కల్పిస్తుంది. చపాతీలతో పాటు ఇతర కూరగాయలు, ప్రోటీన్, మంచి కొవ్వులను కలిపిన ఆహారాన్ని తీసుకోవడం మంచిది. డయాబెటిస్ ఉన్నవారు, బరువు తగ్గాలనుకునేవారు రోజూ ఎంత మోతాదులో తింటున్నారో నియంత్రించాలి. చపాతీ పిండిలో ఓట్స్ లేదా జొన్న పిండి కలపడం ఉత్తమం.



## కాలి మీద కాలు వేసుకొని కూర్చుంటున్నారా?


మనలో చాలామందికి కాలిమీద కాలు వేసుకొని కూర్చునే అలవాటుంటుంది. లేదంటే ఒక కాలు ముడుచుకొని సీటుమీద పెట్టుకుంటారు. రెండు కాళ్లను కింద పెట్టారు. ఎవరితోనైనా మాట్లాడే సమయంలో కూడా ఒద్దికగా కూర్చోవాలి. అలా కాకుండా కాలిమీద కాలు వేసుకొని కూర్చుంటారు. పెద్దల ముందు అలా చేయకూడదు. ఇలా



చేయడం సౌకర్యంగా అనిపించినప్పటికీ కొన్ని ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. అవి ఏమిటనే విషయాన్ని తెలుసుకుందాం. రక్త ప్రసరణలో అంతరాయం ఇలా కూర్చోవడం వల్ల కాలి నరాలపై ఒత్తిడి పెరిగి రక్త ప్రసరణకు అంతరాయం కలిగే అవకాశం ఉంది. దీని వల్ల కాళ్ళు ఉబ్బడం, నొప్పి, తిమ్మిరి వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. "కాకరకాయతో కలిపి ఈ ఆహారాలు అస్సలు తినొద్దు.. ఎంత డేంజరంటే?" నరాలకు నష్టం ఎక్కువ సేపు ఇలా కూర్చుంటే నరాలకు నష్టం జరుగుతుంది. దీని వల్ల కాలిలో గిటార్లు, నొప్పి వంటి సమస్యలు తీవ్రంగా మారవచ్చు. సైయాటికా కొంతమందికి ఇలా కూర్చోవడం వల్ల సైయాటికా వచ్చే అవకాశం ఉంది. సైయాటికా అంటే వెన్ను నుంచి కాళ్ళ వరకు వ్యాపించే నొప్పి. జీర్ణ సమస్యలు కాలిపై కాలు వేసుకొని కూర్చోవడం వల్ల జీర్ణ వ్యవస్థపై కూడా ప్రభావం పడుతుంది. మలబద్ధకం, అజీర్తి వంటి సమస్యలు వస్తాయి. "తక్కువ ఖర్చుతో హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఇలా!" భంగిమ సమస్యలు ఎక్కువ సేపు ఇలా కూర్చోవడం వల్ల భంగిమ సరిగా లేక వెన్ను నొప్పి, మెడ నొప్పి వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ఎలా నివారించాలి? కాలి మీద కాలు వేసుకొని కూర్చోవడం తగ్గించాలి. అప్పుడప్పుడు లేచి నడవాలి. కూర్చునేటప్పుడు వెన్ను సరిగా ఉండేలా చూసుకోవాలి. కంఫర్టబుల్ కుర్చీలో కూర్చోవాలి. రోజూ వ్యాయామం చేయాలి. గర్భిణీ స్త్రీలు, వృద్ధులు, కాలి నొప్పి ఉన్న వారు ఇలా కూర్చోవడం పూర్తిగా తగ్గించాలి. కాలి మీద కాలు వేసుకుని కూర్చోవడం వల్ల వెన్నెముకపై 32% అదనపు ఒత్తిడి కలుగుతుంది. దీర్ఘకాలంలో వెన్నెముక నొప్పి, తుంటి నొప్పి వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. పురుషులలో వృషణాల ఉష్ణోగ్రత పెరగడం, స్పెర్మ్ కౌంట్ తగ్గడం వంటి సమస్యలు కూడా వస్తాయి.

## ప్రతి రోజూ ఒక కప్పు దానిమ్మ గింజలు తింటే చాలు.. క్యాన్సర్, రక్తపోటు మాయం.!!

దానిమ్మను సూపర్ ఫ్రూట్ అని పిలుస్తారు, దానిమ్మ పండు తన అందమైన ఎరుపు రంగు, రుచికరమైన గింజలతో ప్రతి ఒక్కరినీ ఆకర్షిస్తుంది. ఇది కేవలం రుచికరమైన పండు మాత్రమే కాదు, అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంటుంది. ప్రతిరోజూ ఒక గిన్నె దానిమ్మ గింజలు తినడం అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచడం నుంచి హృదయ ఆరోగ్యాన్ని మెరుగుపరచడం వరకు సహాయపడుతుంది. 1. హృదయ ఆరోగ్యం దానిమ్మ గింజలు యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా కలిగి ఉండటం వల్ల హృదయానికి సంబంధించిన అనేక సమస్యలను తగ్గించగలవు. ముఖ్యంగా, ప్యూనికాలజిన్స్ అనే యాంటీ ఆక్సిడెంట్లు రక్తనాళాల్లో క్లోమాన్ని తగ్గించి, రక్త ప్రవాహాన్ని మెరుగుపరుస్తాయి. దీంతో హృదయ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. "కేక్స్‌తో క్యాన్సర్ ముప్పు.. తినే ముందు ఈ విషయాలు తెలుసుకోండి." 2. రక్తపోటు నియంత్రణ దానిమ్మలో సహజమైన రసాయనాలు హైబ్లడ్ ప్రెజర్‌ను తగ్గించడంలో సహాయపడతాయి. ఉన్నవారికి చాలా ఉపయోగకరమైనది. దానిమ్మ గింజలలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరచి, మలబద్ధక సమస్యలను తగ్గిస్తుంది. 3. రోగనిరోధక శక్తి పెంపు దానిమ్మలో అనేక రకాల యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌ను తొలగించి, కణాలకు హాని కలిగించకుండా కాపాడతాయి. దానిమ్మలో విటమిన్ అ పుష్కలంగా ఉంటుంది. ఇది రోగనిరోధక వ్యవస్థను బలపరచడంలో సహాయపడుతుంది. అలాగే, దీని యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు శరీరంలోని వాపులను తగ్గిస్తాయి. 4.క్యాన్సర్ నిరోధకం దానిమ్మలోని యాంటీ ఆక్సిడెంట్లు కొన్ని రకాల క్యాన్సర్‌లను నిరోధించడంలో సహాయపడతాయి. ముఖ్యంగా ప్రోస్టేట్ క్యాన్సర్ మరియు రొమ్ము క్యాన్సర్‌లను నిరోధించడంలో ఇది చాలా ప్రభావవంతంగా ఉంటుంది. దీనిని తరచూ తీసుకోవడం వల్ల మెదడు ఆరోగ్యాన్ని కాపాడటంలో సహాయపడుతుంది. ఇది ప్రత్యేకంగా వృద్ధాప్యంతో వచ్చే గుర్తు తప్పే సమస్యలను నివారించగలదు.




# 500 మంది వెయిటింగ్.. ముంబైలో షూట్ వర్షార్పణం

బాలీవుడ్ దిగ్గజ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ ఓ సినిమా తెరకెక్కిస్తున్నారు అంటే, దానికి రోజువారీ బడ్జెట్ టూమచ్ కాస్ట్‌లీగా ఉంటుంది. ఇంతకుముందు రామ్ లీలా, దేవదాస్, పద్మావత్, గంగూభాయి కథియావాడీ, హీరామండి వంటి చిత్రాల కోసం అతడు భారీ సెట్లను నిర్మించి వాటిలో చిత్రీకరణలు చేసాడు. ఒక్కోసారి లైవ్ లొకేషన్ లోను వందలాది



జూనియర్ ఆర్టిస్టులతో షూటింగ్ చేయడం ఆయనకు రివాజు. భారీ తనం నిండిన ప్రాపర్టీలో సన్నివేశాల్ని భారీగా తెరకెక్కిస్తారు గనుక ఇది అవసరం. ఇప్పుడు అలాంటి ఓ సన్నివేశంలో అతడి 'లవ్ అండ్ వార్' షూటింగ్ మొత్తం వర్షార్పణం అయింది. ముంబైలో ప్లాన్ చేసిన షెడ్యూల్ అనూహ్యంగా వర్షం కారణంగా డిస్ట్రబ్ అయింది. దాదాపు 500 మంది షూట్ లో పాల్గొనాల్సి ఉండగా, లొకేషన్ పూర్తిగా నీట మునకలేసింది. లోకల్ ట్రైన్స్ లో లొకేషన్ కి చేరాల్సిన వారంతా ఎక్కడికక్కడ బంద్ అయిపోయారు. దీంతో చాలా మంది షూటింగుకి రాకపోవడం, పైగా వారి బాగోగులు, రక్షణ దృష్ట్యా కూడా సంజయ్ లీలా భన్సాలీ షూటింగుని నిలిపి వేయడం చర్చనీయాంశమైంది. ముంబైలో గత కొద్దిరోజులుగా కుండపోతగా వర్షం కురుస్తోంది. దీంతో రహదారులు కూడా బంద్ అయిపోయాయి. రణబీర్ కపూర్, విక్కీ కౌశల్, అలియా భట్ ప్రధాన పాత్రల్లో భన్సాలీ రూపొందిస్తున్న ఈ చిత్రంలో భారీ సన్నివేశాలకు కొదవేమీ లేదు. భన్సాలీ మార్క్ కళాత్మకతకు లోటు ఉండదని తెలిసింది. కానీ ఇలా వర్షాలు, వరదలు అతడికి అంతరాయం కలిగిస్తున్నాయి. అయినా రాజీ అన్నదే లేని ఈ ప్రముఖ దర్శకుడు షూటింగ్ ని నిలిపివేసారు. వర్షం తగ్గిపోయి సాధారణ పరిస్థితి వచ్చాకే షూటింగ్ చేయాలని అతడు భావిస్తున్నట్టు తెలిసింది. 2026 మార్చిలో ఈ సినిమాని విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు. అవసరం మేర ప్రధాన తారాగణం భన్సాలీకి అన్నివిధాలా సహకరిస్తున్నారు. అయితే ప్రకృతి విపత్తుల వేళ ఎవరూ ఏమీ చేయలేరు. దీనిని అందరూ అర్థం చేసుకుని భన్సాలీకి సహకరిస్తున్నారని తెలిసింది. గంగూభాయి కథియావాడీ, హీరామండి లాంటి భారీ ప్రాజెక్టుల తర్వాత భన్సాలీ ఇప్పుడు లవ్ అండ్ వార్ ని అంతే ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్నారు.

# 'రామాయణం పార్ట్-1': యష్‌తో హాలీవుడ్ స్టంట్ మాస్టర్!

రాకింగ్ స్టార్ యష్ నటిస్తున్న 'రామాయణం పార్ట్-1' సినిమా టాలీవుడ్, బాలీవుడ్‌లో భారీ అంచనాలను రేకెత్తిస్తోంది. నితీష్ తివారి డైరెక్షన్‌లో, నమిత్ మల్హోత్రా నిర్మాణంలో రూపొందుతున్న ఈ చిత్రం దీపావళి 2026లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమాలో యష్ రావణుడి పాత్రలో నటిస్తుండగా, రణబీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా కనిపించనున్నారు. ఈ భారీ ప్రాజెక్ట్ ఇప్పటికే గాసిప్స్ తో అభిమానులను ఆకర్షించింది,



ఇప్పుడు కొత్త అప్‌డేట్‌తో మరింత హైప్ సృష్టిస్తోంది. తాజా సమాచారం ప్రకారం, 'రామాయణం పార్ట్-1'లో యాక్షన్ సీక్వెన్స్‌ల కోసం యష్‌తో హాలీవుడ్ స్టంట్ డైరెక్టర్ గై నారిస్ చేతులు కలిపాడు. 'మ్యాడ్ మాక్స్: ఫ్యూరీ రోడ్', 'మాడర్టల్ కోంబాట్' లాంటి హాలీవుడ్ హిట్స్‌లో స్టంట్స్ డిజైన్ చేసిన గై నారిస్, ఈ సినిమాలోని యాక్షన్ సన్నివేశాలను మరింత థ్రిల్లింగ్‌గా తీర్చిదిద్దనున్నాడు. "మిత్ మీట్స్ మ్యాడ్‌నెస్" అనే ట్యాగ్‌లైన్‌తో ఈ కాంబినేషన్ సినిమాపై అంచనాలను రెట్టింపు చేసింది. ఈ యాక్షన్ సీక్వెన్స్‌లు రావణుడి పాత్రకు కొత్త డైమెన్షన్‌ను తీసుకొస్తాయని టీమ్ భావిస్తోంది. ఈ సినిమాలో యష్ రావణుడి పాత్ర కోసం ఇప్పటికే ఇంటెన్స్ ట్రైనింగ్‌లో ఉన్నాడు. 'ఐఉఈ' సిరీస్‌తో పాన్-ఇండియా స్టార్‌గా ఎదిగిన యష్, ఈ సినిమాలో రావణుడి ఇంటెన్సిటీ, ఎమోషనల్ డెప్త్‌ను అద్భుతంగా చూపించనున్నాడని అంటున్నారు. గై నారిస్ డిజైన్ చేసే యాక్షన్ సీక్వెన్స్‌లు రామ-రావణ యుద్ధ సన్నివేశాలను మరో స్థాయికి తీసుకెళ్లనున్నాయి. ఈ సన్నివేశాలను ముంబైలోని ఓ భారీ సెట్‌లో చిత్రీకరించనున్నారు, ఇందుకోసం టీమ్ ఇప్పటికే సన్నాహాలు మొదలుపెట్టింది. సినిమాలో సాయి పల్లవి, రణబీర్ కపూర్‌లతో పాటు సన్నీ డియోల్ హనుమంతుడిగా, రవి దుబే కుంభకర్ణుడిగా నటిస్తున్నారు. ఏఆర్ రహమాన్ సంగీతం, శివ శక్తి దత్తా లిరిక్స్‌తో సినిమా ఆడియో ఆల్బమ్‌పై కూడా భారీ అంచనాలు ఉన్నాయి. సినిమా విజువల్ ఎఫెక్ట్స్ కోసం హాలీవుడ్ టీమ్‌తో కలిసి పనిచేస్తున్నారు, దీనివల్ల 'రామాయణం పార్ట్-1' ఒక విజువల్ స్పెక్టాకిల్‌గా నిలవనుందని అంటున్నారు. ఈ సినిమా రామాయణాన్ని ఒక కొత్త కోణంలో చూపించనుందని టీమ్ చెబుతోంది. మొత్తంగా, 'రామాయణం పార్ట్-1' దీపావళి 2026లో ఐదు భాషల్లో విడుదలై, బాక్సాఫీస్ వద్ద సందడి చేయనుంది. ఇక యష్-గై నారిస్ కాంబో యాక్షన్ సీక్వెన్స్‌లు, రణబీర్-సాయి పల్లవి ఎమోషనల్ పెర్ఫామెన్స్‌లతో ఈ సినిమా ఎలాంటి విజయం సాధిస్తుందో చూడాలి.

# రెండు క్లైమాక్సులు కన్ఫ్యూజ్ చేయవా?

ఇటీవలే 'హౌస్ ఫుల్' ఫ్రాంచైజీ నుంచి కొత్త సినిమా ట్రైలర్ విడుదలై బంపర్ హిట్టయింది. ఈ ట్రైలర్ సినిమాపై ఉత్కంఠను పెంచింది. ఒక గంటలోపు ఇది 9 లక్షల వీక్షణలను పొందింది. ఇది 163 నిమిషాల రన్‌టైమ్‌తో హౌస్‌ఫుల్ ఫ్రాంచైజీలో సుదీర్ఘ నిడివి ఉన్న చిత్రమని తెలుస్తోంది. జూన్ 6న సినిమా రిలీజ్ కానుండగా, ఈ సస్పెన్స్ మిస్టరీ, కామెడీ డ్రామా సినిమాకి రెండు క్లైమాక్సులు ఉంటాయని తెలిసి అందరూ ఆశ్చర్యపోతున్నారు. ఇందులో చివరి వరకూ హంతకుడు ఎవరు? అనేది ఎవరికీ తెలీదట. ఇలాంటి సస్పెన్స్ ఇంతకుమునుపు ఎన్నడూ ప్రేక్షకులు అనుభవించి ఉండరు అని చెబుతున్నారు. ఇందులో అక్షయ్ కుమార్, రితేష్ దేశ్‌ముఖ్ ,అభిషేక్ బచ్చన్ తదితరులు నటిస్తున్నారు. ఆసక్తికరంగా ఈ సినిమాని హౌస్‌ఫుల్ 5 , హౌస్‌ఫుల్ 5ఏ అనే రెండు పేర్లతో రిలీజ్ చేస్తారట. ఈ చిత్రానికి రెండు క్లైమాక్సులు ఉన్న విషయాన్ని సాజిద్ నడియాడ్ వాలా స్వయంగా రివీల్ చేయడం ఆసక్తిని పెంచింది. ఒక రకంగా రెండు క్లైమాక్సులు అనే కాన్సెప్ట్ నిజంగా ఆశ్చర్యం కలిగించేది. మిస్టరీ థ్రిల్లర్ హాలీవుడ్ రేంజులో ప్రేక్షకుల్ని కుర్చీ అంచుకు కట్టిపడేస్తుందని చెబుతున్నారు. అయితే రెండు క్లైమాక్సులు దేనికి? అంటే... కచ్చితంగా దక్షిణాది ప్రేక్షకుల్ని దృష్టిలో ఉంచుకుని క్లైమాక్స్ కి రెండో ఆప్షన్ ఇచ్చారా? అన్న చర్చా సాగుతోంది. ప్రేక్షకుల అభిరుచి మేరకే మేకర్స్ తెలివిగా ఈ నిర్ణయం తీసుకుని ఉండొచ్చు. మరో ఐదారు రోజులు ఆగితే దీనిపై థియేటర్లలోనే ఆడియెన్ కి క్లారిటీ వచ్చేస్తుంది. వెయిట్ అండ్ సీ..






# లెజెండ్ ప్రశంసపై నాని తన్మయం!

సీనియర్ హీరోలంతా తర్వాత తరం హీరోలందరికీ ఏదో రకంగా స్ఫూర్తిగా నిలుస్తుంటారు. సందర్భం వచ్చినప్పుడు ఆ సీనియర్ల గురించి ఎంతో గొప్పగా తమ మనసులో భావాలను బయట పెడుతుంటారు. నేచురల్ స్టార్ నాని కూడా విశ్వనటుడు కమల్ హాసన్ పై తన అభిమానాన్ని చాటుకున్న సందర్భం ఒకటుంది. 'హిట్ 3' ప్రచారంలో భాగంగా 'హాయ్ నాన్న' సినిమాలో తాను హాస్పిటల్



బయట సీన్ లో నటించే టైం లో కమల్ సార్ సీన్ గుర్తు తెచ్చుకుని చేశా అన్నాడు నాని. కమల్ హాసన్ నటించిన 'విరుమాండి' సినిమాలో ఆయన చివరి సీన్ లో కోర్ట్ లో నిద్రపోతే ఒకరు వచ్చి నిద్రలేపితే ఆయన చేసిన యాక్టింగ్ వేరే లెవెల్ లో ఉంటుంది. అంత సహజంగా ఎలా చేస్తారా అనిపిస్తుందని, ఆ సీన్ చాలా ఇష్టమని అందుకే 100 సార్లు చూశానని అన్నాడు నాని. ఆ సీన్ రిఫరెన్స్ తోనే 'హాయ్ నాన్న'లో చేశానని అన్నారు నాని. తాజాగా 'థగ్ లైఫ్' ప్రచారంలో ఉన్న కమల్ హాసన్ ముందుకు ఈ విషయం వెళ్లింది. ఈ నేపథ్యంలో నాని వ్యాఖ్యలను కమల్ స్వాగతించారు. నా సహచరులు , అభిమానులు నా ప్రదర్శన గురించి మాట్లాడినప్పుడు ఎంతో ఉత్సాహంగా అనిపిస్తుంది. ప్రేక్షకులతో పాటు నాని నా భావాలను సరిగ్గా అర్థం చేసుకున్నారు. ఓ నటుడికి ఇంతకు మించిన సక్సెస్ ఇంకేముంటుంది. గొప్ప ప్రదర్శన ఇచ్చిన ప్పుడు ప్రత్యేకించి కృతజ్ఞతా భావం అవసరం ఉండదు. నాని గురించి కమల్ అలా స్పందించడంతో నాని ఆనందానికి అవధుల్లేవ్. 'ఇది చాలు సార్'. చాలు' అంటూ నాని స్పందించాడు. కమల్ లాంటి లెజెండరీ నోట ప్రశంస అంటే చిన్న విషయమా? నటీనటుల పెర్ఫార్మెన్స్ గురించి కమల్ హాసన్ చాలా తక్కువగా మాట్లాడుతారు. తన మనసుకు నచ్చితే తప్ప స్పందించరు. అలాంటి కమల్ నోటే నాని ప్రశంస అందుకున్నాడు. అందుకే నాని కూడా చాలు సార్ అంటూ తన భావాన్ని పంచుకున్నాడు.




Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printed at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal**, **RNI No. APTEL/2012/46940,** e-mail: **sreechakratelugu@gmail.com.**